నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ శుక్రవారం 22-1-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 147 పేజీలు: 4 వెల: రూ.1/-

ఘనంగా సురవరం125వ జయంతి ఉత్సవాలు

స్వగ్రామంలో విగ్రహ ఏర్పాటు
కవి సమ్మేళనాలు, సాహితీ చర్చలు
మంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): తెలంగాణ వైతాళికులు, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత సురవరం ప్రతాప రెడ్డి 125 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రతాపరెడ్డి 125 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సురవరం సాహిత్య, చరిత్ర పరిశోధన, జర్నలిజం లాంటి రంగాలలో చేసిన సేవలను నేటి తరానికి అందించేందుకు తెలంగాణ సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ వైతాళికులను, సంగీత, సాహిత్య వేత్తలను, కవులను, మేధావులను, కళాకారులు మొదలైన రంగాలలో విశిష్ట సేవలందించిన ప్రముఖుల జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించి గౌరవిస్తున్నామన్నారు. మే 28 న సురవరం జయంతిని పురస్కరించుకుని ఆయన స్వగ్రామం

అలంపూర్ చౌరస్తాలో గాని ఇటిక్యాల వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి అందుకు స్థల పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. సురవరం ప్రతాప్ రెడ్డి రచించిన కథలను, నాటికీకరించి నాటకోత్సవాలను సంగీత నాటక అకాడమీ ద్వారా నాటకాలుగా ప్రదర్శించేలా కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి అధికారులకు సూచించారు. హైదరాబాద్ తో పాటు పాటు ఉమ్మడి 10 జిల్లా కేంద్రాలలో కవిసమ్మేళనాలు, సాహితీ చర్చలు మేధావులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించాలని మంత్రి అధికారులను కోరారు. సురవరం చేసిన సేవలను నేటి తరానికి తెలిసేలా వివిధ పత్రికలు ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం లభించేలా మీడియా సంస్థల ఎడిటర్లతో సమావేశం నిర్వహించాలని అధికారులను కోరారు. వీటితో పాటు షార్ట్ ఫిల్మ్స్ వీడియో కాంటెస్ట్ లు నిర్వహించాలని, వీటితో పాటు తెలుగు యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ లలో ప్రతాప్ రెడ్డి సాహిత్య కృషి మీద చర్చలు జరపాలని మంత్రి అధికారులకు సూచించారు. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం పై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సురవరం కుటుంబ సభ్యులు కపిల్ , గిరిధర్ రెడ్డి, నివేదిత, పుష్పలత, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

మేఘాలయ, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల అవతరణోత్సవం

మూడు రాష్ట్ర ప్రజలకు మోడీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ,జనవరి21(ఆర్ఎన్ఎ): భారత ప్రధాని మోదీ మేఘాలయ, మణిపూర్, త్రిపుర రాష్ట్రాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మూడు రాష్ట్రాలు తమ సొంత రాష్ట్ర హోదాను పొందిన రోజు సందర్భంగా మోదీ వీటికి, ఈ రాష్ట్రాల ప్రజలను అభినందించారు. ఈశాన్య ప్రాంతాల యాక్ట్ 1971 ప్రకారం మణిపూర్, మేఘాలయ 1972 జనవరి 21న రాష్ట్ర హోదాను పొందాయి. ఈ రాష్ట్ర ప్రజలను విష్ చేస్తూ నరేంద్ర మోదీ ట్వీట్ చేశారు. 'మేఘాలయలోని సోదర, సోదరీమనులకు రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా నా హృదయ పూర్వక శుభాకాంక్షలు. మేఘాలయ కొత్త తరం వారు ఎంతో సృజనాత్మకత కలిగిన వారు. మీరు మీ రాష్ట్రం రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానని మోదీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మరొక మెసేజ్ ద్వారా దేశాభివృద్ధికి మణిపూర్ సహకారాన్ని కూడా ఆయన గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర అవతరణ సందర్భంగా మణిపూర్ వాసులకు నా శుభాకాంక్షలు. దేశాభివృద్ధికి మణిపూర్ చేసిన సహకారాన్ని దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేరు. సృజనాత్మకతకు, ప్రతిభకు మణిపూర్ పెట్టిన పేరుగా నిలిస్తుంది. ఇదే విధంగా రాష్ట్రం మరింత ముందుకు కొనసాగాలని మోదీ తన రెండో ట్వీట్‌లో పేర్కొన్నారు. వీటితో పాటుగా ప్రధాని వివిధ రంగాల్లో త్రిపుర యొక్క ప్రతిభను కూడా కొనియాడారు. త్రిపురలోని సంప్రదాయం, గొప్ప మనసున్న వారిగా త్రిపురకు దేశమంతా గౌరవం ఇస్తోందని, అనేక రంగాల్లో అద్భుతంగా రాణిస్తోందని, అలాగే కొనసాగాలని మోదీ అన్నారు. అంతేకాకుండా నేడు ఈ మూడు రాష్ట్రాల అవతరణ దినోత్సవ సందర్భంగా ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు అవతరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణలో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వనున్నారు. ఇప్పటికే తెలంగాణలో బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎ స్‌తో కలిపి 60 శాతానికి రిజర్వేషన్లు చేరాయి. రెండు రోజుల్లో అధికారులతో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తారు. ఉన్నతస్థాయి సమావేశం తర్వాత తగు ఆదేశాలు జారీ చేస్తారు. దేశంలో అగ్రవర్ణాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు తెలంగాణలో మోక్షం రాబోతోంది. రాజ్యాంగ సవరణ ద్వారా తెచ్చిన 10శాతం రిజర్వేషన్లను కేంద్రంతో పాటు పలు ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేస్తున్నా.. ఇక్కడ మాత్రం అమలుకు నోచుకోవడంలేదు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడం లేదని, అన్ని కోర్సులకు అమలయ్యేలా సానుకూల నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇటీవల సూచించిన విషయం తెలిసిందే.

రైల్వే కేటాయింపుల్లో తెలంగాణకు అన్యాయం

రైల్వే ఉద్యోగుల భవనాన్ని ప్రారంభించిన కెటిఆర్

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): సికింద్రాబాద్‌లో నూతనంగా నిర్మించిన దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల సంఘ్ డివిజనల్ కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. భారతీయ రైల్వే ప్రపంచంలోనే అతిపెద్ద వ్యవస్థ అని పేర్కొన్నారు. రైల్వే కార్మికులతో ఎప్పుడూ కలిసే ఉన్నాం. ఉద్యమ సమయంలోనూ స్నేహభావంతో మెలిగామని గుర్తు చేశారు. రైల్వే కార్మికులకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాజీపేటలో రైల్వే వ్యాగన్ కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అందుకోసం కేంద్రం 135 ఎకరాల భూమిని అడిగితే.. ప్రభుత్వం 300 ఎకరాల భూమిని వారి చేతిలో పెట్టింది.. కానీ ఒక్క అడుగు ముందుకు పడటం లేదు. హైస్పీడ్ రైళ్లతో అభివృద్ధి వేగవంతం అవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. హైస్పీడ్ రైళ్లు, బుల్లెట్ రైళ్లు మన రాష్ట్రానికి రాలేదు. రైల్వే బడ్జెట్ కేటాయింపుల్లో దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతుందన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం రైల్వే ఉన్నతిని కాంక్షిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇండియన్ రైల్వే విశేషమైన సేవలందించింది. దేశం కోసం, ప్రజల క్షేమం కోసం రైల్వే కార్మికులు పని చేస్తున్నారు అని కేటీఆర్ అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మంత్రులు శ్రీనివాస్ గౌడ్, పువ్వాడ అజయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కెటీఆర్‌కు అనుకూలంగా ఊపందుకున్న ప్రచారం

ఆయనే నూతన సిఎం అంటూ మంత్రి గంగుల వ్యాఖ్యలు
అడ్వాన్స్‌గానే కంగ్రాట్స్ చెప్పిన డిప్యూటి స్పీకర్ పద్మారావు

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో మంత్రి కేటీఆర్ కాబోయే సీఎం అంటూ రెండు మూడు రోజులుగా జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ వ్యాఖ్యలపై టీఆర్ఎస్‌పార్టీ పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఎట్టకేలకు పెదవి విప్పారు. మంత్రి కేటీఆర్ సీఎం కావడానికి అన్ని అర్హతలు ఉన్నాయని గంగుల కమలాకర్ సంచలనమైన వ్యాఖ్యలు చేశారు. గురువారం కరీంనగర్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్‌ను సీఎం చేస్తానంటూ వస్తున్న వార్తలు అవి మా అంతర్గత విషయమని తెలిపారు. ఎవరిని సీఎం చేయాలన్న దానిపై మా బాస్ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. మా సీఎం అభ్యర్థితో బీజేపీకి ఏమీ సంబంధం లేదని, రాష్ట్ర ప్రజలు టీఆర్ఎస్ ప్రభుత్వ పాలన నచ్చి మాకు సంపూర్ణ మెజార్టీ ఇచ్చారని వెల్లడించారు. మంత్రి కేటీఆర్.. సీఎం కేసీఆర్‌కు తగ్గ తనయుడని, కేటీఆర్ వల్లే హైదరాబాద్‌కు అంతర్జాతీయ కంపెనీలు వస్తున్నాయని గంగుల ప్రశంసించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా కేటీఆర్ సమర్థుడే అని ఆయన స్పష్టం చేశారు. పాలనాపరంగా కేటీఆర్‌కు మంచి అనుభవం ఉందన్నారు. కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. సీఎం అంశం తమ పార్టీ అంతర్గత వ్యవహారం.. బీజేపీకి లేదా ఇతర పార్టీలకు దీనిపై మాట్లాడే అనవసరం అని మంత్రి గంగుల పేర్కొన్నారు.

తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ మరో అడుగు ముందుకేసి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాబోయే ముఖ్యమంత్రి కేటీఆర్‌కు కంగ్రాట్స్ అంటూ పద్మారావు వ్యాఖ్యానించారు. సికింద్రాబాద్‌లో నూతనంగా నిర్మించిన దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల సంఘ్ డివిజనల్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పద్మారావు గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ కూడా హాజరయ్యారు. బహుశా త్వరలోనే కాబోయే సీఎం కేటీఆర్‌కు శాసనసభ, రైల్వే కార్మికుల తరపున శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు డిప్యూటీ స్పీకర్ పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్‌కు సీఎం అయ్యే అర్హతలు ఉన్నాయని మంత్రులు గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, షకీల్ పేర్కొన్న విషయం విదితమే. సీఎం పదవికి కేటీఆర్ సమర్థుడే అని వారు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.

సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే సంఘ్ కార్యాలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డిప్యూటి స్పీకర్ పద్మారావు. చిత్రంలో మంత్రి కెటిఆర్ కూడా ఉన్నారు.

పూణె సీరం సంస్థలో అగ్నిప్రమాదం

మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది

ముంబై,జనవరి21(ఆర్ఎన్ఎ): సీరం ఇన్‌స్టిట్యూట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. పుణెలోని సీరం సంస్థ టెర్మినల్ గేట్-1 వద్ద ఈ అగ్నిప్రమాదం సంభవించింది. సెజ్ 3లో నిర్మాణంలో ఉన్న భవనంలో అగ్నిప్రమాదం సంభవించడంతో నాలుగు, ఐదో అంతస్తులోకి పొగలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది

పది యంత్రాలతో సంఘటనా స్థలానికి చేరుకుని ఎగసిపడుతున్న మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తుంది. ఈ ప్లాంట్‌లో పలు వ్యాక్సిన్‌లతో పాటు కొవిషీల్డ్ ఉత్పత్తి జరుగుతుంది. అగ్నిప్రమాదం వల్ల కొవిషీల్డ్ ఎటువంటి ఆటకం లేదని తెలిపారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, బ్రిటీష్-స్వీడిష్ ఫార్మా ఫర్మ్ ఆస్ట్రాజెనీకా, సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంయుక్త భాగస్వామ్యంలో కరోనా వ్యాక్సిన్‌ను ఇక్కడ అభివృద్ధి చేస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణం తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఎస్ఐఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ జాదవ్ మాట్లాడుతూ.. బీసీజీ వ్యాక్సిన్ సంబంధిత పనులు జరుగుతున్న ప్రాంతంలో మంటలు సంభవించాయన్నారు. కొవిషీల్డ్ వ్యాక్సిన్ తయారీ, నిల్వ ఈ ప్రాంతానికి దూరంగా ఉందని పేర్కొన్నారు. పీఎంసీ చీఫ్ ఆఫీసర్ ప్రశాంత్ రాన్‌పైస్ మాట్లాడుతూ.. భవనంలో నలుగురు వ్యక్తులు ఉన్నట్లు తెలిపారు. వీరిలో ముగ్గురిని రక్షించినట్లు వెల్లడించారు.

సిమ్ స్వాప్ చేస్తూ మోసాలు

ముఠాను పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): సిమ్ స్వాప్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. గత పదేండ్లుగా మోసాలకు పాల్పడుతున్న ముంబైకి చెందిన మీరారోడ్డు గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని సైబరాబాద్ సీపీ సజ్జనార్ మీడియా ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. 2011 నుంచి సిమ్ స్వాప్ దందా చేస్తూ కోట్లు కాజేశారని వెల్లడించారు. వివిధ సంస్థల ఆర్థిక లావాదేవీలు చేస్తున్న ఫోన్ నంబర్లను టార్గెట్ చేస్తున్నారని, ఆ మొబైల్ సిమ్‌లను బ్లాక్ చేసి నిందితులు నగదు కాజేస్తున్నారని చెప్పారు. నగరానికి చెందిన ఇద్దరిని మోసం చేసి రూ.11 లక్షలు కాజేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ ముఠాకు చాలా అకౌంట్లు ఉన్నాయని చెప్పారు. కాజేసిన డబ్బులను బిట్‌కాయిన్, హవాలా ద్వారా నైజీరియాకు పంపిస్తున్నారని వెల్లడించారు. నిందితుల నుంచి 40 నకిలీ ఆధార్ కార్డులు, 4 రబ్బరు స్టాంపులు, 15 మొబైల్ ఫోన్లు, నకిలీ లెటర్ ప్యాడ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

జీనోమ్ వ్యాలీలో టీకా నార్ధారణ, ధృవీకరణ కేంద్రం

కెటిఆర్ లేఖపై స్పందించిన వెంకయ్యనాయుడు
అభ్యర్థనను పరిశీలించాలని కేంద్రమంత్రికి సిఫార్సు

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ శివారులోని జీనోమ్ వ్యాలీలో టీకా పరీక్ష, ధ్రువీకరణ కేంద్రం ఏర్పాటుకోసం తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై కేందంరం సానుకూలంగా స్పందించింది. ఈ అభ్యర్థనను పరిశీలించాలని కేంద్ర వైద్య, కుటుంబసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌కు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. వెంకయ్యనాయుడు చేసిన సూచనపై స్పందించిన కేంద్ర మంత్రి.. ఆ విషయాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కెటిఆర్ సూచన మేరకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. టీకా పరీక్ష, ధ్రువీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలంటూ తెలంగాణ ఐటీశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కేంద్ర మంత్రికి లేఖ రాశారు. దీన్ని పత్రికల్లో చదివిన తర్వాత కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌తో ఉపరాష్ట్రపతి మాట్లాడారు. కరోనా వైరస్ మహమ్మారికి హైదరాబాద్ కేంద్రంగా టీకాను రూపొందించడంతోపాటు 600 కోట్ల టీకాలు ఉత్పత్తి చేసిన సామర్థ్యాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. దీనికి స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను పరిశీలిస్తానని హర్షవర్ధన్ చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అనుమతులు సంపాదించాల్సి ఉంటుందన్నారు. ప్రపంచంలో ఇటువంటి కేంద్రాలు ఏడు మాత్రమే ఉన్నాయని.. అందువల్ల ఈ విషయాన్ని అన్నికోణాల్లో పరిశీలించి నిర్ణయించాల్సిఉంటుందని.. ఈ సూచనను ఉన్నతస్థాయిలో పరిశీలిస్తామని ఉపరాష్ట్రపతికి డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు.

మృత్యువుతో పోరాడి ఓడిన బాలుడు

కాలిన గాయాలతో చికిత్స పొందుతూ మృతి

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): కసాయి తండ్రిచేతిలో తీవ్రంగా గాయపడిన చరణ్ (12) మృత్యువుతో పోరాడి ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీ చోటు చేసుకుంది. ఈ నెల 18న చరణ్ ఆన్‌లైన్ క్లాసులకు హాజరు కావడం లేదంటూ కొడుకుపై ఆగ్రహం చెందిన తండ్రి టర్పెంటాయిల్ పోసి నిప్పంటించాడు. మంటలను తట్టుకోలేక బాలుడు ఇంట్లో నుంచి బయటకు పరుగులు పెట్టాడు. దీంతో అక్కడి స్థానికులు వెంటనే బాలుడి శరీరంపై ఉన్న మంటలను ఆర్పి..ఆస్పత్రికి తరలించారు. మృత్యువుతో పోరాడుతున్న బాలుడు చరణ్..ఈరోజు తుదిశ్వాస విడిచాడు. ఈ దురాగతానికి పాల్పడిన తండ్రిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

సోనూసూద్‌కు హైకోర్టులో ఎదురు దెబ్బ!

బిఎంసి నిర్ణయాన్ని సమర్థించిన కోర్టు

ముంబై,జనవరి21(ఆర్ఎన్ఎ): బాలీవుడ్ నటుడు సోనూసూద్ కు ముంబై హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ముంబై మునిసిపల్ కార్పొరేషన్ తనపై వేసిన కేసును కొట్టేయాలని సోనూ కోర్టును ఆశ్రయించగా.. ఆయన అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. ముంబైలోని ఓ భవనాన్ని మునిసిపాలిటీ పర్మిషన్ తీసుకోకుండా హూటల్ గా మార్చారన్నది సోనూపై నమోదైన అభియోగం. దీంతో.. బహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ అనుమతి లేకుండా భవనాన్ని హూటల్ గా మార్చారని ఫిర్యాదులో పేర్కొంది బీఎంసీ. అయితే.. ఈ కేసును సవాల్ చేస్తూ సోనూ సూద్ ముంబై హైకోర్టును ఆశ్రయించగా.. పైవిధంగా తీర్పు ఇచ్చింది. కాగా..

సిటీ సివిల్ కోర్టులోనూ సోనూకు ఇదే అనుభవం ఎదురవడం గమనార్హం. సోనూ సూద్ పిటిషన్ను బాంబే హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి పథ్వీరాజ్ చవాన్ కొట్టివేశారు. జుహూలోని ఆరు అంతస్తుల భవనాన్ని ఎలాంటి అనుమతులు లేకుండానే హూటల్గా మార్చారంటూ బీఎంసీ అక్టోబరులో నోటీసులు పంపింది.

ఆ నోటీసులను సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు సోనూసూద్. మహారాష్ట్ర రీజియన్ అండ్ టౌన్ ఎ÷-లానింగ్ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘించారని పలుమార్లు నోటీసులు పంపినా సోనూసూద్ స్పదించడం లేదంటూ బీఎంసీ పోలీస్ కేసు పెట్టింది. ఐతే బీఎంసీ ఆరోపణలను సోను సూద్ ఖండించారు.

నివాస భవనాన్ని హూటలా మార్చేందుకు బీఎంసీ నుంచి 'చేంజ్ ఆఫ్ యూజర్' అనుమతులు తీసుకున్నానని స్పష్టం చేశాడు సోనూ. అయితే.. ఇటీవల విచారణ సందర్భంలో ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ సంచలన వ్యాఖ్యలు చేసింది. సోనూసూద్ అలవాటు పడ్డ నేరస్తుడని వ్యాఖ్యానించింది.

బాంబే హైకోర్టుకు దాఖలు చేసిన అఫిడవిట్లో ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జుహూ ప్రాంతంలో సోనూ అనధికారికంగా భవనాలు నిర్మించారని వాటిని గతంలో రెండుసార్లు కూల్చినప్పటికీ.. పద్ధతి మార్చుకోలేదని అఫిడవిట్లో బీఎంసీ వెల్లడించింది. హైకోర్టులో కూడా ఊరట దక్కకపోవడంతో హైకోర్టు డివిజనల్ బెంచ్ ను ఆశ్రయించే అవకాశం ఉంది.

చరిత్రలో నేటినిజం

అశ్వారావు పేటలో పామాయిల్ మిల్లు

బీచుపల్లిలో వేరుశనగ నూనె ఉత్పత్తి
ఆయిల్‌ఫెడ్ బోర్డు సమావేశంలో మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,జనవరి20(ఆర్ఎన్ఎ): తెలంగాణ ముడిపామాయిల్ మిల్లును అశ్వారావుపేటలో ఏర్పాటు చేయాలని, అలాగే బీచుపల్లిలో వేరుశనగర నూనె ఉత్పత్తిని వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయిల్‌ఫెడ్ బోర్డు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మార్కెట్‌లో వేరుశనగ వంటనూనెలకు మంచి డిమాండ్ వుంది. ప్రజలకు నాణ్యమైన వంటనూనెలు అందించాలన్నారు. అశ్వారావుపేటలో పామాయిల్ గెలల పీచు నుండి ముడి పామాయిల్ తీసే మిల్లును ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ముడి పామాయిల్ శుద్ధి చేసేందుకు అశ్వారావుపేటలో 30 మెట్రిక్‌టన్నుల సామర్థ్యం గల ట్యాంకు ఏర్పాటు చేయాలన్నారు. ఆయిల్‌ఫెడ్ సంస్థకు వచ్చిన లాభాల నుంచి రెండు శాతం నిధులు సీఎస్ఆర్ కింద రైతులకు ఉపయోగపడే పనుల కోసం వెచ్చించాలన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు పెరగడం మూలంగా భవిష్యత్‌లో ఆయిల్‌ఫెడ్ సంస్థ బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ ఎండి నిర్మల, ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఆగ్రోస్ ఎండి రాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫెడ్ డైరీలు, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

కలిసికట్టుగా పనిచేయండి

ఖమ్మం నేతలకు కెటిఆర్ హితబోధ

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): ఖమ్మం నేతలతో మంత్రి కేటీఆర్ సమావేశం ముగిసింది. గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేయాలని కేటీఆర్ సూచించారు. కొత్త, పాత అంద రితో కలిసి పనిచేయాలన్నారు. నియోజక వర్గంలో పార్టీ బలంగా ఉండటం అవసరమని, పార్టీలో నాయకులంతా కలిసి పనిచేయాలని తెలిపారు. జమిలి ఎన్నికలపై ప్రచారం జరుగుతోందని.. జమిలి వచ్చినా.. రాకపోయినా అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ పేర్కొన్నారు. నియోజ కవర్గాల వారీగా అభివృద్ధి పనులకు సంబ ంధించిన వివరాలను మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యేలు అందించారు. గ్రూపు తగాదాలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కొందరు ఎమ్మెల్యేల తీరుపై సీరియస్ అయినట్లు తెలిసింది.

అమెరికాతోనే మన భవిష్యత్ !

నేటినిజం

శుక్రవారం 22-1-2021

మన భవిష్యత్ అంతా అమెరికాపైనే ఆధారపడి ఉంది. అక్కడే చదువులు..అక్కడే కొలువులు..అక్కడి సెటిల్ కావడం అన్న లక్ష్యాలతో విద్యార్థులు ప్రణాళికలు వేసుకుంటారు. అమెరికాలో ఉన్నత చదువుల చదివి అక్కడే సెటిల్ అయిన వేలాదిమంది..భారత్‌లో ఇంజనీరింగ్ తదితర చదువులు చదువుతున్న వారికి స్ఫూర్తిగా నిలుస్తారు. సుందర్ పిచా÷-,సత్య నాదెళ్ల లాగా కలలు కనకున్నా అంతటి స్థాయిని చేరుకోలేక పోయినా సాదాసీదా ఉద్యోగం సైతం అమెరికా అయితే చాలనుకునే వారు 90శాతం మంది భారతీయులు ఉన్నారు. అందుకే అమెరికా వెళ్లిన వారు అక్కడే స్థిరపడే ప్రయత్నం చేస్తారే తప్ప భారత దేశానికి తిరిగి రారు. తరువాతి ప్రాధాన్యాల్లో బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా వంటి దేశాలు ఉన్నాయి. అయితే ప్రథమ ప్రాధాన్యం ఎప్పటికీ అమెరికా కావడం గమనార్హం. అందుకే అమెరికాలో చీమ చిటుక్కుమన్నా మన వాళ్లు కందిపోతారు. ఏం జరిగిందో అని ఆరా తీస్తారు. అక్కడంతా సాఫీగా ఉండాలని,సవ్యంగా సాగాలని కోరుకుంటారు. ఈ క్రమంలో గత నాలుగేళ్లుగా ట్రంప్ హయాంలో మనవాళ్లు అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. వీసాల విషయంలో ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగాలు పోయి నానాయాతన పడ్డారు. ఇదంతా కూడా భారత్‌లో నిరుద్యోగ భారతం పెరగుతున్న క్రమాన్ని సూచిస్తోంది. ప్రధాని మోడీ ఎన్నో ఆశలు చూపినా నిరుద్యోగం విషయంలో అట్టర్ ఫ్లాప్ అయ్యారు. దేశంలో అంతకంతకూ నిరుద్యోగం తాండవిస్తోంది. కరోనా కారణంగా పరిస్థితి మరింత దిగజారింది. ఉద్యోగాలు,ఉపాధి కలో÷-పోవాల్సి వచ్చింది. ఈ దశలో అమెరికా పరిణామాలపైనే భారతీయులు ఆసక్తి చూపుతున్నారు. బైడెన్ అధ్యక్షుడిగా, కమలాహారిస్ ఉపాధ్యక్షురాలిగా ప్రమాణం చేయడం..బైడెన్ సానుకూల వచనాలు పలకడం అంతా గమనిస్తున్నారు. 46 వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం బైడెన్ తన మనోగతాన్ని, లక్ష్యాలను వివరిస్తూ.. సవాళ్లను సమైక్యంగా ఎదుర్కొందామని పిలుపిస్తూ తొలి ప్రసంగం చేశారు.! ప్రజాస్వామ్యం గెలిచిన రోజని, చరిత్రాత్మకమైన రోజని...ఆశావహమైన రోజుల కోసం సంకల్పం తీసుకోవాల్సిన రోజని అన్నారు. అధికార మార్పిడి సజావుగా జరిగింది. అనేక ఆటుపోట్లనీ, అశాంతినీ, యుద్ధాల్నీ ఎదుర్కొన్న అమెరికా ఇక ఆశావహ దృక్పథంతో ముందుకు సాగుతుందన్న భరోసా వచ్చింది. మనం కూడా ఇదే కోరుకుంటున్నాం. సవాళ్లను ఎదర్కొనాలంటే మాటలు కాదు, చేతలు ముఖ్యం. అమెరికా ఏకం కావాలి. ప్రజలంతా ఏకం కావాలి. యునైటెడ్ అమెరికా.. ఇందుకోసం ప్రతి ఒక్కరూ కలిసిరావాలని పిలుపు నిచ్చారు. అదే స్ఫూర్తితో మన ప్రధాని మోడీ కూడా శుభాకాంక్షలు తెలిపారు. అమెరికాను ప్రపంచ క్షేమం కోరే శక్తిగా మళ్లీ తీర్చిదిద్ద వచ్చున్న బైడెన్ వ్యాఖ్యలు ఎందరికో స్ఫూర్తి నింనేలా ఉన్నాయి. కరోనాతో దెబ్బతిన్న మనవాళ్లు కూడా మళ్లీ అమెరికా కుదుట పడాలని చూస్తున్నారు. ఆయన ప్రసంగం యావత్తూ ప్రపంచాన్ని అక్కున చేర్చుకునేలా ఉంది. అలాగే అమెరికన లో ఉన్న భయాలు కూడా తొలగించారు. భవిష్యత్ గురించి చాలా మంది ప్రజల్లో బెంగ, భయాలు ఉన్నాయి. ఉద్యోగం ఉంటుందా, పన్ను లెలా కట్టాలి, కుటుంబాన్నెలా పోషించాలి... ఇలా! రేపేం జరుగుతుందోనన్న ఆందోళన అనేకమందిని వెన్నాడుతోంది. భయపడవద్దు.. మీలో మీరు కుమిలిపోకండి. పోటీపడండి. మిమ్మల్ని నమ్మని వారిని దూరం పెట్టండని బైడెన్ పిలుపు నిచ్చారు. మొత్తంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల నలభైఆరవ అధ్యక్షుడిగా జో బైడెన్, ఉపాధ్యక్షురాలిగా కమలాహారిస్ ప్రమాణస్వీకారంతో ఆ దేశం కొత్త శకంలోకి అడుగుపెట్టింది. సర్వసాధారణంగా అధ్యక్ష ఉపాధ్యక్షుల ప్రమాణస్వీకార ఘట్టం చుట్టూ అల్లుకొని ఉండే వెలుగుజిలుగులూ కోలాహలాలను ఈ మారు కరోనాతో పాటు డోనాల్డ్ ట్రంప్ కూడా కమ్మేశారు. మాజీ అధ్యక్షుడు పోతూ పోతూ ఇంకెన్ని మంటలు పెట్టిపోతారోనన్న భయంతో రాజధాని యావత్తూ దిగ్బంధంలోకి పోయింది. నాలుగేళ్ళ పాలనలో ట్రంప్ తీసుకున్న దాదాపు అన్ని వివాదాస్పద నిర్ణయాలనూ బైడెన్ తిరగదోడవచ్చు. పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి తప్పుకోవడం ద్వారా మిగతా ప్రపంచం దృష్టిలో అమెరికా చాలా పలుచనైంది. ట్రంప్ నిర్ణయాన్ని తిరగదోడి, ఉద్గారాల కట్టడి, పర్యావరణ పరిరక్షణకు అమెరికా కట్టుబడి ఉంటుందని బైడెన్ చాటబోతున్నారు. కరోనా కష్టకాలంలో యావత్ ప్రపంచాన్ని ఒకతాటిపైకి తెచ్చి నాయకత్వస్థానంలో నడవాల్సిన ఆరోగ్య సంస్థను ఇలా నిందలూ నిష్టూరాలతో బలహీనపరచడం, నిధులు ఆపేసి నీరస పరచడం, తద్వారా నిరుపేద దేశాలకు అన్యాయం చేయడం వల్ల ట్రంప్ అపఖ్యాతిని మూటకట్టుకున్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా రెండున్నరకోట్లమంది అమెరికన్లు కొవిడ్ బారిన పడ్డారు. నాలుగులక్షలమంది చనిపోయారు. దేశమంతటా కఠినమైన నియమనిబంధనలు అమలు చేయకపోవడం కూడా కారణంగా చూడాలి. దేశంలో ఇప్పటివరకూ సాగిన అక్రమ వలసలన్నింటినీ ఒక క్రమపద్ధతిన సక్రమం చేసే ఆలోచనలో బైడెన్ ప్రభుత్వం ఉన్నది. అమెరికా మెక్సికో మధ్య ట్రంప్ ప్రేమగా కడుతున్న అడ్డుగోడను సైతం కూల్చివేసి మిగతా ప్రపంచానికి సానుకూల సందేశం ఇవ్వాలని బైడెన్ నిర్ణయించారు. దూరమైన మిత్రదేశాలను దగ్గరచేసుకోవడం బైడెన్‌కు పరీక్ష. అమెరికన్లందరికీ అధ్యక్షుడిని అన్న ఆశ్వాసన ఇస్తూ, పరిస్థితులు కచ్చితంగా మారతాయన్న భరోసా కల్పిస్తున్న కొత్త అధ్యక్షుడు అమెరికాను ఉన్నతంగా నిలబెడతారన్న నమ్మిక కలిగింది. తన కేబినెట్ అమెరికా వైవిధ్యతకు అద్దం పట్టేలా వుంటుందని ఇప్పటికే బైడెన్ ప్రకటించారు. జాతి, రంగు, జెండర్ వంటి అంశాలను దృష్టిలో వుంచుకుని ఆయన కేబినెట్‌ను రూపొందిస్తున్నారు. కొన్ని కీలక పదవుల్లో వుండబోయేవారెవరో ఇప్పటికే ఆయన ప్రకటించారు.ప్రపంచీ కరణవల్ల నష్టపోయిన వర్గాలు ఎంత అసంతృప్తితో వున్నాయో గ్రహించలేకపోయారు. ట్రంప్ అభిశంసన కన్నా వీటిని సరిచేయటం అత్యవసరమని బైడెన్ గ్రహించాలి. అలాగే వివిధ దేశాలతో సంబంధాలు పెంచుకుని ముందుకు సాగాల్సి ఉంది. పెద్దన పాత్రలో కర్రనెత్తనంగా గాకుండా అమెరికా ఓ ఛత్రంగా నిలబడాలి. ఇవన్నీ కూడా భారత్ యువతకు ఆశావహ నిర్ణయాలు కాగలవనే ఆశించవచ్చు. అమెరికా చల్లగా ఉన్నంత కాలం మనమంతా చల్లగా ఉంటాం. అందుకే అమెరికా బాగుండాలని మనమంతా కోరుకుందాం.

అడవుల రక్షణ..పచ్చదనం పెంపు ప్రాతిపదికన ప్రోత్సాహాలు

గణతంత్ర దినోత్సవాన అవార్డుల ప్రదానం: శోభ

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): అడవుల రక్షణ, పునరుజ్జీవనం, పచ్చదనం పెంపు ప్రాతిపదికగా సిబ్బందికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానోత్సవం చేయనున్నట్లు పీసీసీఎఫ్ ఆర్. శోభ తెలిపారు. అడవుల రక్షణ, పునరుజ్జీవనం, పచ్చదనం పెంపుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో బాగా పనిచేస్తున్న సిబ్బందిని ప్రోత్సహించాలని అటవీశాఖ నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని జిల్లాల అటవీ అధికారులతో ఆమె బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాల వారీగా ఆరు కేటగిరీల్లో అటవీశాఖ సిబ్బందిని నగదు ప్రోత్సాహంతో కూడిన ప్రశంసా పత్రాన్ని అందించనున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో జరిగే వేడుకల్లో ఈ అవార్డుల ప్రదానం జరుగుతుందన్నారు. జంగల్ బచావో ? జంగల్ బడావో నినాదంతో తెలంగాణకు హరితహారం ద్వారా జరుగుతున్న కార్యక్రమాలు ఈ ఎంపికకు ప్రాతిపదిక కానున్నాయి. మంచి నర్సరీల నిర్వహణ, పెద్ద మొక్కల పెంపు, నాటిన మొక్కల సంరక్షణ, అటవీ రక్షణ పద్ధతులు, చక్కటి పునరుజ్జీవన చర్యలు, అడవుల్లో నీటి సంరక్షణ, గడ్డి మైదానాల వృద్ధి, హరితహారంలో వివిధ వర్గాల భాగస్వామ్యం వంటి అంశాలను పరిగణలోకి తీసుకోనున్నట్లు వెల్లడించారు. అడవుల్లో క్షేత్ర స్థాయిలో పనిచేసే బీట్ అధికారి, సెక్షన్ ఆఫీసర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లను ప్రోత్సాహకాల కోసం పరిగణిస్తారన్నారు. వచ్చే హరితహారం సీజన్ కోసం పెద్ద మొక్కల పెంపకం అన్ని నర్సరీల్లో చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఎవెన్యూ ఎ÷-లాంటేషన్ కోసం కనీసం ఒకటిన్నర మీటరు ఎత్తైన మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని పీసీసీఎఫ్ (సోషల్ ఫారెస్ట్రీ) ఆర్.ఎం.డోబ్రియల్ తెలిపారు. కంపా నిధుల కింద చేపట్టిన అటవీ అభివృద్ధి పనుల్లో అలసత్వం ఉపేక్షించేది లేదన్నారు. చేపట్టిన పనులను థర్డ్ పార్టీ ద్వారా సమీక్షించటం, ఆమేరకు నిధుల విడుదల ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఏ దశలోనైనా పొరపాట్లు జరిగితే తదుపరి చర్యలకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని పీసీసీఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్ హెచ్చరించారు. ఈ సమావేశంలో పీసీసీఎఫ్ (అడ్మిన్) స్వర్గం శ్రీనివాస్, అదనపు పీసీసీఎఫ్ లు సిద్ధానంద్ కుక్రేటీ, ఎం.సీ. ఫర్గ÷యిన్, ఇతర అధికారులు, అన్ని అటవీ సర్కిళ్లకు చెందిన చీఫ్ కన్జర్వేటర్లు, జిల్లా అటవీ అధికారులు, రేంజ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పదోన్నతుల ప్రక్రియ మొదలైంది: శ్రీనివాసగౌడ్

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖలలో అర్హులైన ఉద్యోగులందరికీ పదోన్నతుల పక్రియ మొదలైందని అబ్కారీ, పర్యాటక, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తనను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులతో మాట్లాడుతూ ఇప్పటికే చాలా శాఖలో డీపీసీ లను ముగించుకొని పదోన్నతుల ఉత్తర్వులను ఇవ్వడం మొదలైందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాణిజ్య పన్నుల శాఖ, అబ్కారీ శాఖ, గ్రౌండ్ వాటర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, మున్సిపల్ శాఖ, అర్ధగణాంక శాఖ మరియు అన్నీ శాఖలలో పదోన్నతుల పక్రియ మొదలైంది. ఈ నెల 31 లోపు అన్నీ శాఖలలో అర్హులైన ఉద్యోగులందరికి ప్రమోషన్లు లభిస్తాయని మంత్రి హామీ ఇచ్చారు.

అర్హులైన పేదలకు ఆరుకిలోల బియ్యం పంపిణీ: మారెడ్డి

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున కిలో రూపాయికే పౌరసరఫరాల శాఖ బియ్యం సరఫరా చేస్తోందని పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సంస్థ చైర్మన్ గా రెండేళ్లు పూర్తి చేసుకున్నసందర్భంగా ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున కిలో రూపాయికే సరఫరా చేస్తోందన్నారు. ప్రతినెల 87.54 లక్షల కుటుంబాలకు 1.75 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తోందని, అలాగే సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలకు మధ్యాహ్న భోజన పథకానికి ఏడాదికి లక్షా 20వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తోందని ఈ బియ్యం క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో ఏమాత్రం రాజీపడొద్దని ఉద్యోగులకు సూచించారు.ధాన్యం కొనుగోళ్లలో ఈ ఏడాది వానాకాలంలో గత ఏడాది వానాకాలం మార్కును దాటడం జరిగింది. గత ఏడాది 47.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా ఈ ఏడాది ఇప్పటి వరకు 47.87 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. దాదాపు 11 లక్షల మంది రైతుల నుండి 6,505 కొనుగోలు కేంద్రాల ద్వారా రూ. 9వేల కోట్లు విలువచేసే 47.87లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు రైతుల నుండి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రూ.8375 కోట్ల రూపాయలను నేరుగా రైతు ఖతాలో జమచేశామని తెలిపారు.

కేసులపై ఒత్తిడితోనే కెటిఆర్‌కు పదవి అప్పగించే యత్నాలు

–కెసిఆర్ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి పొన్నాల

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): మంత్రి కేటీఆర్‌పై ప్రేమతో కాదని, బీజేపీ ఒత్తిడికి తలొగ్గే కేసీఆర్ సీఎం పదవిని వదులుకోవడానికి సిద్ధమయ్యారని కాంగ్రెస్ నేత పొన్నాల లక్ష్మయ్య తప్పుబట్టారు. దిగిపోయాక కూడా కేసులతో బీజేపీ వేధిస్తే.. సానుభూతి పొందాలనేది కేసీఆర్ ఆలోచనగా ఉందన్నారు. భూముల అన్యాక్రాంతంపై సీఎం మౌనం వీడాలని పొన్నాల డిమాండ్ చేశారు. విషయాలు దాచి పెట్టి కబ్జాకోరులను కేసీఆర్ ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. తప్పుచేస్తున్నాడు కాబట్టే కేసీఆర్ మీడియాతో మాట్లడటం లేదని, పూజల పేరుతో దేవుళ్లను ఆయన మోసం చేస్తున్నారని పొన్నాల లక్ష్మయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ బంధువులు భూములు కబ్జా చేస్తే చర్యలు ఉండవా..? అని లక్ష్మయ్య ప్రశ్నించారు. అయోధ్య రామ మందిరానికి విరాళమిచ్చిన ఆయన రాముడు అందరి వాడు.. రాముడికి రాజకీయాలను ఆపాదించటం సరైంది కాదని అన్నారు. రామ మందిర నిర్మాణానికి ఒక లక్షా నూట పదహారు రూపాయల విరాళం ప్రకటించారు ఆయన. నా పెన్షన్ నుంచి రాముడి ఆలయానికి విరాళం ఇస్తున్నామన్నాఆయన భారత రాష్ట్రపతి ద్వారా నా విరాళం పంపిస్తున్నానని అన్నారు.ఇక సంస్కరణలు తెచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్న అయన కేసీఆర్ సీఎం పదవి నుండి తప్పుకుని కొడుక్కి పట్టం కట్టబెట్టే పనిలో ఉన్నారని ప్రచారం జరుగుతోందని అన్నారు. కేసీఆర్ అవినీతి బయట పడుతుంది అని ఢిల్లీకి భయపడుతున్నారన్న పొన్నాల బీజేపీ ఒత్తిళ్లకు సీఎం పదవి నుండి దిగిపోతున్నారని అన్నారు. పదవి నుండి దిగిపోయాక కేసులు వేస్తే సానుభూతితో ఓట్లు పొందే కుట్ర కూడా కేసీఆర్ చేస్తున్నాడని అన్నారు. దేవుడి పేరుతో ప్రాజెక్టులు కడితే అవినీతి అడగరు అని అనుకుంటున్నారని అసలు డీపీఆర్ లు ఇవ్వకుండా ప్రాజెక్టులు కట్టేశారని ఆయన అన్నారు. అవినీతి బయట పడుతుందని డీపీఆర్ ఇవ్వడం లేదని అన్నారు. జగన్ నీళ్ల దోపిడీ బయట పడుతుందని డీపీఆర్ లు ఇవ్వడం లేదని అన్నారు.

అమెరికాతో మన సంబంధాలు మరింత బలోపేతం

బో బైడెన్ రాకతో ఎన్నారైల్లోనూ ఆనందం

వాషింగ్టన్,జనవరి21(ఆర్ఎన్ఎ): ట్రంప్ భారత ప్రధాని మోదీకి సన్నిహితుడు. ఇరువురిదీ జాతీయవాద ఎజెండాయే. చైనాను ప్రతిఘటించే విషయంలో ట్రంప్ ప్రభుత్వం భారత్‌కు బాసటగా నిలిచింది. ఈ విషయంలో బైడెన్ కూడా అదే రీతిన కొనసాగుతారని భారత విదేశాంగ వర్గాలు భావిస్తున్నాయి. భారత్‌తో ఉన్న వాణిజ్య సమస్యల విషయంలో మాత్రం బైడెన్ అంత సులువుగా సానుకూలత కనబర్చకపోవచ్చని అంటున్నారు. అయితే ప్రధాని మోడీ అనుసరించే విధానాలను బట్టి మన సంబంధాలు ఆధారపడి ఉంటాయి. అయితే ఇటీవలి కాలంలో మనం అధ్యక్షుడుగా ఎవరున్నా అమెరికాతో మంచి సంబంధాలనే నెరవుతున్నాం. కనుక విదేశాంగ విధానంలో మార్పులు ఉండకపోవచ్చు. జో బైడెన్ రాక అమెరికాలో ఉంటున్న లక్షల మంది భారతీయులకు పెద్ద ఊరట. ట్రంప్ అనుసరించిన కఠినమైన వలస విధానాన్ని సమూలంగా మార్చేయనున్నట్లు బైడెన్ చెబుతున్నారు.దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించిన 11 లక్షల మందికి ఎనిమిదేళ్లలో పౌరసత్వం ఇచ్చే చర్యలను ఆయన చేపట్టనున్నట్లు, తొలి వందరోజుల్లోనే ఇందుకు సంబంధించిన కార్యాచరణను ప్రకటించనున్నట్లు బైడెన్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉంటున్న వారికి ఐదేళ్లపాటు తాత్కాలిక చట్టబద్ధత ఇస్తారు. అయితే వీరు ఈ జనవరి 1నాటికి అన్ని పన్నులూ కడుతూ, ఇతరత్రా అవసరమైన కనీస నిబంధనలను పాటించినవారై ఉండాలి. మిగిలిన మూడేళ్లలో గ్రీన్‌కార్డు ఇచ్చే పక్రియ ఉంటుంది. ఈ బిల్లు రూపకల్పన ఇప్పటికే జరిగిందని అంటున్నారు. ఇకపోతే అమెరికా చరిత్రలో గత 90 ఏళ్లలో చూడనంత సంక్షోభ పరిస్థితుల మధ్య బైడెన్ దేశాధ్యక్ష పదవి చేపట్టారు. ట్రంప్‌కు ఆయనకు ఎంతో తేడా ఉంది. ట్రంప్‌ది దూకుడు వ్యవహారమైతే.. బైడెన్ సాత్వికుడు. సహజంగా లిబరల్‌గా పేరుంది. బైడెన్ ముందున్నది పూలబాట కాదు. గత వందేళ్లలో ఎన్నడూ చూడనంత వైద్య ఆరోగ్య అత్యవసర పరిస్థితిని అమెరికా ఎదుర్కొంటోంది. రోజుకు 4వేల మంది చనిపోవడం, ఇప్పటికే మరణించిన వారి సంఖ్య 4 లక్షలకు చేరుకోవడంతో బైడెన్ దీనిని తన ప్రథమ ప్రాధాన్యంగా ఎంచుకున్నారు. కొవిడ్ వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ కకావికలమైపోయింది. లక్షల కోట్ల డాలర్ల ఉద్దీపన ప్యాకేజీ వల్ల పరిస్థితి మరింతగా

దిగజారింది. వీటికి తోడు దేశవ్యాప్తంగా వేలమంది ఉద్యోగాలు కోల్పోయారు. దీన్ని పునరుద్ధరించడం బైడెన్‌కు కత్తి మీద సామే. 1861 అంతర్యుద్ధం తరువాత అమెరికన్ సమాజం నిట్టనిలువుగా చీలిపోయింది. దీనికి ట్రంప్ ఆజ్యం పోశారు. ఈ చీలికను మళ్లీ పూడ్చి దేశాన్ని ఏకం చేయడం బైడెన్ ముందున్న అతి పెద్ద సవాలు. అందుకే ఆయన 'అమెరికా యునైటెడ్ ' అన్న నినాదాన్ని చేవడుతున్నట్లు ప్రకటించారు. ట్రంప్ అనుసరించిన విదేశాంగ విధానం వల్ల ఓ రకంగా ప్రపంచ నేతగా ఏళ్ల తరబడి ఉన్న గుర్తింపును అమెరికా కోల్పోయింది. దీన్ని సరిదిద్దుతానని బైడెన్ ఇప్పటికే ప్రకటించారు. విస్తరణవాదంతో నానాటికీ రెచ్చిపోతున్న చైనాకు ఆయన ఎంతవరకూ కళ్లెం వేస్తారన్నది చూడాలి.

జానాకు ధీటైన అభ్యర్థి కోసం బిజెపి అన్వేషణ !

జానాకు ధీటైన అభ్యర్థి కోసం బిజెపి అన్వేషణ !
స్థానిక నేతల్లో ఒకరిని ఎంపిక చేయడంపైనా ఆలోచన

నాగార్జునసాగర్,జనవరి21(ఆర్ఎన్ఎ): సాగర్ ఉపఎన్నికలో పోటీ చేసే అభ్యర్థి విషయంలో బీజేపీ ఆచితూచి వ్యవహరిస్తోంది. జానారెడ్డిని ఢీకొట్టే సామర్థ్యం ఉన్న నేతను బరిలో దించేందుకు ప్రణాళిక రచిస్తున్నారు. గతంలో జానా తనయుడు పార్టీలోకి వస్తారని భావించినా ఆ వ్యూహం సాకారం కాకపోవడంతో ఇప్పుడు

కొత్ అభ్యర్థిని అన్వేషిస్తున్నారు. స్థానిక అభ్యర్థికే ప్రాధాన్యం ఇవ్వాలన్న వాదనా ఉంది. దుబ్బాక ఉప ఎన్నికలో గెలిచి .. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బలం పుంజుకున్నాక ఇప్పుడు పార్టీ అన్ని ఎన్నికల్లోనూ సత్తా చాటాలని చూస్తోంది. నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో ఖచ్చితంగా విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. నాగార్జునసాగర్‌లో బలమైన జానారెడ్డిని ఢీకొట్టాలంటే.. ఆ స్థాయిలో ఆర్థిక అంగబలం కలిగిన వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించాలనే నిర్ణయానికి వచ్చారని బీజేపీ నేతలు అంటున్నారు. ప్రస్తుతం ఆ వేటలోనే పార్టీ నేతలు ఉన్నారని తెలుస్తోంది. అది ఎవరని అన్నది ఎవరూ చెప్పలేని పరిస్థితి.రాష్ట్రంలో నెలకొన్న అనుకూల వాతావరణాన్ని కొనసాగించడానికి ఏం చేయాలన్నదానిపై భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. సాగర్‌లో వ్యూహం ఏ మాత్రం బెడిసి కొట్టినా అది ప్రతికూలంగా మారే ప్రమాదం ఉంటుందని భావించి అందుకు అనుగుణంగా నాగార్జునసాగర్ ఉపఎన్నిక కోసం ఇంఛార్జ్‌ను కూడా నియమించింది. అక్కడి పరిస్థితిపై ఒకటి రెండు సర్వేలు చేయించింది. పార్టీపట్ల సానుకూల వాతావరణం ఉన్నా.. అభ్యర్థుల విషయం లోనే తేల్చుకోలేక పోతున్నారని సమాచారం. 2018 ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన కంకణాల నివేదిత రెడ్డి మరోసారి టికెట్ ఆశిస్తున్నారు. తనకే టికెట్ వస్తుందన్న ఆశతో ప్రచారం కూడా మొదలుపెట్టేశారు. అయితే 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దిగిన అంజయ్య యాదవ్ సైతం కాషాయగూటికి చేరి.. పోటీకి ఆసక్తితో ఉన్నారు. ఆయన కూడా ప్రచారం ప్రారంభించేశారు. ఇలా ఇద్దరు నేతలు పోటాపోటీగా నియోజకవర్గంలో ప్రచారం చేస్తుండటంతో పార్టీకి నష్టం జరుగుతుందని భావించి నివేదిత, అంజయ్యలతో బీజేపీ నేతలు మీటింగ్ పెట్టి సర్దిచెప్పారని తెలుస్తోంది. అయితే వెనక్కి తగ్గడానికి ఎవరూ ఒప్పుకోలేదని సమాచారం. నివేదిత, అంజయ్యలలో ఎవరో ఒకరిని అభ్యర్థిగా బరిలో దింపినా జానారెడ్డిపై తెలిపోతారని బీజేపీ నేతలు భావిస్తున్నారు.

అసోం మెడికల్ కాలేజీలో గడ్డకట్టిన వ్యాక్సిన్

గౌహతి,జనవరి21(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి నివారణకు కొవిషీల్డ్ టీకా అందుబాటులోకి వచ్చిన తరవాత..టీకా పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. అయితే అసోంలోని సిల్‌చార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో నిల్వ ఉంచిన వెయ్యి కొవిషీల్డ్ డోసులు గడ్డ కట్టాయి. ఈ వ్యాక్సిన్‌ను 2 నుంచి 8 డిగ్రీల సెల్సియస్ వద్ద నిల్వ చేయాలి. కానీ ఈ మెడికల్ కాలేజీలో టీకాలు నిల్వ ఉంచిన ప్రదేశంలో ఉష్ణోగ్రతలు మైనస్‌లోకి వెళ్లిపోవడంతో గడ్డ కట్టినట్లు తేలింది. కాగా, ఐస్ లైనెడ్ రిఫ్రిజిరేటర్(ఐఎల్ఆర్)లో సాంకేతిక సమస్యల కారణంగానే టీకాలు గడ్డ కట్టాయని అధికారులు తెలిపారు. అయితే ఐఎల్ఆర్‌ను 2 నుంచి 8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల మధ్య ఉంచుతాం. ఎప్పుడైతే ఉష్ణోగ్రతలో మైనస్‌లోకి వెళ్లిపోతాయో.. తమకు వెంటనే సందేశం వస్తుదనీ.. అయితే ఈ సారి అలాంటి మేసేజ్ రాకపోవడంతో

కాళేశ్వరంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కృష్ణా నీటి దోపిడీలో జగన్‌తో కెసిఆర్ కుమ్మక్కు
మండిపడ్డ కాంగ్రెస్ నేతలు భట్టి, జీవన్ రెడ్డి

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రీ డిజైనింగ్ పేరుతో వేల కోట్ల దోపిడీ చేస్తున్నారని మండపడ్డారు. 6 నెలలకోసారి అంచనా వ్యయం పెంచి రూ.1.15 లక్షల కోట్లకు తీసుకొచ్చారని, ఆరేళ్ల నుంచి అడుగుతున్నా డీపీఆర్ బయటపెట్టలేదని తప్పుబట్టారు. త్వరలో టీఆర్ఎస్ దోపిడీని బయటపెడతామని భట్టి విక్రమార్క హెచ్చరించారు. ఇకపోతే పోతిరెడ్డిపాడు ద్వారా నీటి దోపిడీ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని జీవన్ రెడ్డి వేరుగా మండిపడ్డారు. ధనిక రాష్ట్రం.. కాస్తా అప్పుల్లో కూరుకుపోయింది. స్థానిక రిజర్వేషన్ అమలు చేయాల్సిన తెలంగాణ.. ఆ మాటే మరిచిపోయింది అని మాజీమంత్రి జీవన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో 80శాతం తెలంగాణ యేతరులు తెలంగాణ ప్రాంత నిరుద్యోగుల ఉద్యోగాలు కొల్లగొడుతున్నారు. పోతిరెడ్డి పాడుకు వ్యతిరేకంగా ఉద్యమించి..ఇప్పుడు నీళ్లు కొల్లగొడుతున్న పట్టించుకోవడంవ లేదు. కృష్ణా జిలాల్లో ఏపీ.. తెలంగాణ హక్కులకు భంగం కలిగిస్తుంటే కేసీఆర్ ఎందుకు సైలెంట్ గా వున్నారు. తెలంగాణ ప్రయోజనాలు జగన్ కి తాకట్టుపెట్టారు కేసీఆర్...

కేసీఆర్ అసమర్థత.. అవినీతి కాంక్షతోనే జగన్ తో కుమ్మక్కు అయ్యారు అని అన్నారు. కాళేశ్వరం తో 18 లక్షల ఎకరాలకు నీటిని అందించడం కోసమే కట్టారు. 450 టీఎంసీ వినియోగించుకునే సామర్థ్యం ఉన్నా... వాడుకోవడం లేదు. అవసరం లేకున్నా అదనపు టీఎంసీ నీటిని నువ్వే తొడుతున్నావ్.. దీన్ని సాకుగా చూపి కృష్ణా నదికి ఆంధ్రకు మళ్లించుకునే పనిలో పడ్డారు జగన్. అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరించుకునే పనిలో భాగంగానే ఫేజ్ 2 చేపట్టారు. కృష్ణా నదిపై ఉన్న అన్ని ప్రాజెక్టులు.. ప్రశ్నార్థకం కాబోతున్నాయి. రాష్ట్ర విభజన బిల్లుకు భిన్నంగా ఎవరు ఏ ప్రాజెక్టు కట్టినా..అవి అక్రమ ప్రాజెక్టులుగా గుర్తిస్తాం అని కేంద్ర మంత్రి చెప్పారు. కేంద్రం ఆదేశాలు కాదని ప్రాజెక్టులు కట్టడం వల్ల తెలంగాణ నష్టపోతోంది అని పేర్కొన్నారు.

అన్నదాత కన్నీరు పెట్టకుండా చూస్తున్న కెసిఆర్

రైతువేదిక ప్రారంభోత్సవంలో మంత్రి సబిత

రంగారెడ్డి,జనవరి21(ఆర్ఎన్ఎ): అన్నం పెట్టే రైతన్నకు కన్నీరు రాకుండా చూస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందరం అండగా ఉందామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబుపేట్ మండల కేంద్రంలో రైతు వేదికను, పాఠశాల అదనపు గదులు, లైబ్రరీ భవనాన్ని, ఎల్లకొండ గ్రామంలో రైతు వేదికలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు సాగుపై చర్చించుకోవాడానికి రాష్ట్ర వ్యాప్తంగా 2,604 రైతు వేదికలు నిర్మాణం చేపట్టామన్నారు.రైతుబంధు కింద 7,500 కోట్లను అన్నదాతలకు పంపిణీ చేశామన్నారు. పంటలకు మద్దతు ధర వచ్చేలా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసి ఎల్లకొండ శివాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి, వైస్ చైర్మన్ విజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండల్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ చట్టాలపై ఓ మెట్టు దిగిన కేంద్రం

ఏడాదిన్నర పాటు చట్టాల అమలు నిలిపివేత
అవసరమైతే సుప్రీంలో అఫిడవిట్ వేస్తాం
చట్టాల రద్దుపైనే రైతు సంఘాలు పట్టు
ఆలోచించి చెబుతామన్న రైతు సంఘాల నేతలు
మరోమారు 22న భేటీ కావాలని నిర్ణయం
చర్చలు సానుకూలంగా జరిగాయన్న కేంద్రమంత్రి

న్యూఢిల్లీ,జనవరి21(ఆర్ఎన్ఎ): నూతన సాగు చట్టాలపై కేంద్రం, రైతు ప్రతినిధుల మధ్య బుధవారం జరిగిన 10వ విడత చర్చలు ఎలాంటి సానుకూల ఫలితం రాబట్టకుండానే ముగిసాయి. చట్టాలను రద్దు చేసే ప్రసక్తే లేదని కేంద్రం మంత్రుల బృందం తేల్చిచెప్పింది. అయితే, ఏడాదిన్నర పాటు చట్టం అమలును నిలిపి ఉంచేందుకు సిద్ధమని, ఈ మేరకు సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పిస్తామని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనతో రైతు ప్రతినిధులు విభేదించారు. సాగు చట్టాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపసంహరించు కోవాలని పునరుద్ఘాటించారు. సమావేశానంతరం రైతు ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ, కోర్టులో అఫిడవిట్ సమర్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తమకు చర్చల్లో తెలియజేసిందని, ఇందుకోసం ఏడాదిన్నర పాటు చట్టాల అమలును నిలిపి ఉంచుతామని చెప్పిందని ఆల్ ఇండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా వివరించారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), మూడు చట్టాలపై కమిటీ వేస్తామని, కమిటీ సిఫారసులు అమలు చేస్తామని కూడా ప్రభుత్వం చెప్పిందన్నారు. ప్రభుత్వ ప్రతిపాదనలపై గురువారంనాడు తాము సమావేశమై చర్చిస్తామని హన్నన్ మొల్లా తెలిపారు. కాగా, మరో రైతు ప్రతినిధి మాట్లాడుతూ, ఏడాదన్నర పాటు చట్టాలను సస్పెండ్ చేసేందుకు సిద్ధమని కేంద్ర ప్రతినిధులు చెప్పారని, అయితే చట్టాలను సస్పెండ్ చేయడానికి ఒప్పుకునేది లేదని, చట్టాలు రద్దు చేయాల్సిందేనని రైతు ప్రతినిధులు విస్పష్టంగా చెప్పారని తెలిపారు. ఇదిలావుంటే రైతు ప్రతినిధులతో తాము జరిపిన చర్చల్లో పురోగతి కనిపించిందని, సరైన మార్గంలో చర్చలు నడుస్తున్నాయని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన జరుపుతున్న రైతు ప్రతినిధులతో 10వ విడత చర్చలు జరిపిన అనంతరం తోమర్ మీడియాతో మాట్లాడుతూ, ఈనెల 22వ తేదీ నాటికి ఒక పరిష్కారం కుదిరే అవకాశం ఉందని చెప్పారు. ఏడాది లేదా ఏడాదిన్నర పాటు చట్టాల అమలును నిలిపి ఉంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తాము తెలియ జేశామని, రైతు సంఘాలు కూడా చాలా సీరియస్‌గానే ఈ విషయాన్ని తీసుకుని, గురువారంనాడు చర్చించి తమ సమాధానాన్ని ఈనెల 22న తెలియజేస్తామని చెప్పారని మంత్రి తెలిపారు. కాగా, ఈనెల 22న మరోసారి సమావేశం కావాలని ఇవాళ జరిగిన చర్చల్లో కేంద్రం, రైతు ప్రతినిధులు నిర్ణయించారు.

వివాదాస్పద చట్టాలను వెనక్కి తీసుకోవాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు. దీనికి కేంద్ర మాత్రం ససేమిరా అంటోంది. ఈ క్రమంలోనే రైతులు, కేంద్ర ప్రభుత్వం మధ్య ఇప్పటి వరకు 9సార్లు చర్చలు జరిగాయి. కానీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో కేంద్రం మరోసారి నేడు 10వ సారి చర్చలు జరిపింది. నేటి చర్చల్లో కేంద్రం రైతులకు ఓ ఆఫర్‌ను ప్రకటించింది. వివాదాస్పదంగా మారిన చట్టాలను ఒకటి లేదా రెండు సంవత్సరాలు పాటు నిలిపివేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించినట్లు రైతుల సంఘాల ప్రతినిధి కవిత కూరగంటి బుధవారం మీడియాకు వెల్లడించారు. రైతులు, ప్రభుత్వ ప్రతినిధులతో సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేద్దామని ప్రతిపాదించింది. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుందామని చెప్పింది. కేంద్రం ప్రతిపాదనపై రైతు సంఘాల నేతలు రేపు సింఘు బోర్డర్ వద్ద సమావేశమై చర్చించుకుంటాం. ప్రభుత్వ ప్రతిపాదన రైతు ప్రయోజనాలు కాపాడేలా ఉందా లేదా అన్నది చర్చిస్తాం. తదుపరి నిర్ణయాన్ని ఈనెల 22న జరిగే భేటీలో కేంద్రానికి తెలియజేస్తాం. ఈ ప్రతిపాదనతో కేంద్రం దిగొచ్చినట్టే కనిపిస్తోందని కవిత తెలియజేశారు. అయితే మరోసారి జనవరి 22న రైతులతో కేంద్రం చర్చలు జరపనున్నట్లు ప్రకటించింది.

నందిగ్రామ్ వస్తే మమతను ఓడిస్తా: సువేందు అధికారి

కోల్‌కతా,జనవరి21(ఆర్ఎన్ఎ): పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీస్తుండటంతో రాజకీయాలు రక్తికట్టిస్తున్నాయి. అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నేతల మధ్య మాటలతూటాలు పేలుతున్నాయి. తాజాగా హుగ్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇటీవలే తృణమూల్ నుంచి బీజేపీలో చేరిన సీనియర్ నాయకుడు సువేందు అధికారి ముఖ్యమంత్రి మమతాబెనర్జి, ఆమె పార్టీ లక్ష్యంగా విమర్శలు చేశారు. నందిగ్రామ్‌లో మమతను ఓడిస్తానని హెచ్చరించారు. మమతాబెనర్జి కేవలం 62 వేల మంది ఓటర్లను నమ్ముకుని నందిగ్రామ్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి సిద్ధమయ్యారు. కానీ నాకు అక్కడ 2.13 లక్షల మంది జై శ్రీరామ్ నినాదాలు చేసే ఓటర్లు ఉన్నారు. అందువల్ల నందిగ్రామ్ నుంచి మమతాబెనర్జిపై పోటీకి దిగే బీజేపీ అభ్యర్థి ఎవరైనా వారిని గెలిపించే బాధ్యత నేనే తీసుకుంటా' అని సువేందు అధికారి వ్యాఖ్యానించారు. ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రతా బక్షి ఓ సభలో మాట్లాడుతూ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో జై శ్రీరామ్ నినాదం పనిచేయదని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో నందిగ్రామ్ నియోజకవర్గ ప్రజలు ఆయన వ్యాఖ్యలకు దిమ్మతిరిగిపోయే సమాధానం చెబుతారు' అని సువేందుకు అధికారి మండిపడ్డారు.

పేదింటి ఆడపిల్లలకు రక్షణగా కళ్యాణలక్ష్మి

చెక్కులు పంపిణీ చేసిన మంత్రి కొప్పుల

జగిత్యాల,జనవరి21(ఆర్ఎన్ఎ): పేదింటి ఆడపిల్లల పెండ్లిళ్లు భారం కావొద్దనే సీఎం కేసీఆర్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల్ని అమలు చేస్తుందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి మండలానికి చెందిన లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశ పెట్టి పేదలకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆడపిల్లల తల్లికే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు ఇస్తున్నామని తెలిపారు. అలాగే కాన్పు సమయంలో అంగన్ వాడీల ద్వారా పాలు, గుడ్లు, మంచి భోజనాన్ని గర్భిణులకు పోషకాహార రూపంలో అందజేస్తున్నామ తెలిపారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పేర్లు చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని సూచించారు.

శశికళకు అస్వస్థత

బెంగళూరు,జనవరి21(ఆర్ఎన్ఎ): అక్రమాస్తుల కేసులో బెంగళూరు సెంట్రల్ జైలులో ఉన్న వీకే శశికళ అస్వస్థతకు గురయ్యారు. జ్వరం రావడంతో జైలు అధికారులు ఆమెను చికిత్స నిమిత్తం లేడీ క్రూజన్ ఆస్పత్రికి తరలించారు. రాత్రి శ్వాస తీసుకోవడంలో శశికళ ఇబ్బంది పడ్డట్లుగా సమాచారం. శశికళ ఈ నెల 27న జైలు నుంచి విడుదల కానుంది.

వ్యవసాయ చట్టాలను రద్దు చేయించాలి

తాత్కాలిక వాయిదాతో లాభం లేదని గుర్తించాలి

విజయవాడ,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్లు ఈ దేశంలో వ్యవసాయోత్పత్తుల మార్కెట్‌ను తమ గుప్పెట్లో చిక్కించుకోడానికి పన్నిన వలలో భాగమే మోడీ చేసిన మూడు వ్యవసాయ చట్టాలని సిపిఎం మరోమారు విమర్శించింది.. వీరి బారి నుంచి వ్యవసాయాన్ని, ఆహార భద్రతను కాపాడుకోవాలంటే రైతు, కూలి, వృత్తిదారుల ఉమ్మడి పోరాటం అవసరం అని సిపిఎం రాష్టరకార్యవర్గ సభ్యులు ఎం. కృష్ణమూర్తి అన్నారు. ఈ చట్టాల వలన వినియోగదారులూ నష్టపోతారు. అందువలన మొత్తం శ్రమ జీవులందరి విశాల ఐక్య ఉద్యమం కూడా అవసరం అన్నారు. ఏడాదిన్నరపాటు వాయిదా వేస్తామంటున్న ప్రభుత్వం అసలు మొత్తం చట్టాలను రద్దు చేసి కనీస మద్దతు ధరల హామీని ప్రకటించాలని అన్నారు. వ్యవసాయమంటే రైతు, కూలీ, వృత్తిదార్ల ఉమ్మడి శ్రమ. రైతు నష్టం అందరికీ నష్టమే. వ్యవసాయంలో నష్ట ఫలితమే గ్రామాలను విడిచి పట్టణాలకు వలసలు పెరిగాయి. ఏ రైతూ తన కొడుకు వ్యవసాయంలో ఉండాలనుకోవడం లేదు. ఆ కారణంగానే వ్యవసాయంలో యువకులు లేరు. అందరూ తల నెరిసిన వారే అని గుర్తించాలన్నారు. ఇంకోవైపున అవసరమైనప్పుడు కూలీలు దొరకడం లేదన్న భావన కూడా రైతులలో ఉంది. వ్యవసాయంలో ట్రాక్టర్లు, యంత్రాల వాడకం పెరిగాక కూలీలకు దొరికే పని దినాలు బాగా తగ్గాయి. అందువలన బతుకుతెరువు కోసం వారు ఇతర పనులను వెతుక్కుని పోతున్నారు. కనుకనే రైతు కోరుకున్న సమయంలో ఒక్కోసారి కూలీలు దొరకడం లేదు. నిజానికి ప్రభుత్వ విధానాల వలన రైతులు, కూలీలు ఇరువురూ నష్టపోతున్నారు. లాభపడుతున్నది దళారీలే. వారికి ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. అందుచేత రైతు నష్టాలకు కారణం ప్రభుత్వ విధానాలేనని వారికి వివరించి ఈ అపోహల నుండి రైతును బయటకు తేవాలన్నారు. ప్రభుత్వ విధానంతో పాటు కొత్త వ్యవసాయ చట్టాలు కూడా అమలయితే రైతులు నష్టపోతారు. రైతుకు ఈ వాస్తవం తెలియకపోవడంతో కూలి పెరగడమే తమ నష్టానికి కారణంగా భావిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పాలక వర్గ పార్టీలు వారికనుగుణంగా వ్యవహరిస్తున్న ప్రచార సాధనాలు రైతుల నష్టాలకు ప్రభుత్వ విధానాలు కారణం కాదని, కూలి రేట్లు ఎక్కువ ఇవ్వవలసి రావడమే కారణమని నిరంతరం తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. ఎప్పుడోకాని కనపడని ప్రభుత్వం కన్నా నిత్యమూ క్లళెదురుగా వుండే కూలీలే తమ నష్టాలకు కారణమని రైతులు అనుకోవడానికి పాలక వర్గాల ప్రచారం దోహదం చేస్తున్నదన్నారు.

ఇంటి ముంగిట్లోకి ఇక రేషన్

-సరఫరా వాహనాలను ప్రారంభించిన సిఎం జగన్

విజయవాడ,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): రాష్ట్ర వ్యాప్తంగా ఇంటికి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమానికి ఎపి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 9260 రేషన్ పంపిణీలకు సంబంధించిన డెలివరీ వాహనాలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి బెంజిసర్కిల్ నుండి జెండా ఊపి ప్రారంభించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు సంబంధించిన 2500 వాహనాలకు ప్రారంభించిన ఆయన వాహన డ్రైవర్లకు కీని అందించారు. మిగిలిన జిల్లాలకు కేటాయించిన వాహనాలను కూడా ఇతర మంత్రులు ప్రారంభిస్తారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇంటి వద్దకే రేషన్ అందజేసేందుకు ఏటా 830కోట్లు అదనంగా వెచ్చిస్తూ ఈ పథకాన్ని రూపొందించారు. స్వర్ణ రకం, మధ్యస్థ రకం వంటి బియ్యాన్ని లబ్దిదారులకు ఫిబ్రవరి 1 నుండి అందించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొడాలి నాని, జిల్లా కలెక్టర్ ఇంతియాజ్..తదితరులు పాల్గొన్నారు. విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. మిగిలిన జిల్లాలకు కేటాయించిన వాహనాలను మంత్రులు ప్రారంభిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 9,260 వాహనాలు ప్రారంభంకానున్నాయి. ఫిబ్రవరి 1వతేదీ నుంచి నాణ్యమైన రేషన్ బియ్యం డోర్ డెలివరీ కోసం ఈ వాహనాలు సిద్ధమయ్యాయి. లబ్దిదారులకు నాణ్యమైన, మెరుగుపరచిన బియ్యాన్ని ఇంటివద్దే అందచేసేందుకు ఏటా రూ.830 కోట్లు అదనంగా వెచ్చిస్తూ పథకాన్ని రూపొందించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి సంక్షేమనిధి

కరోనా బారిన పడ్డ వారికి రూ. 3 కోట్ల 56 లక్షల సాయం అందచేత

వివరాలు వెల్లడించిన అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

హైదరాబాద్,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): జర్నలిస్టుల సంక్షేమం కొరకు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ముందు చూపుతో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల సంక్షేమ నిధి జర్నలిస్టులకు రక్షణ కవచంలాగా మారిందని రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. కరోనా బారినపడ్డ జర్నలిస్టులకు ఆర్థికసాయం పంపిణీపై ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి కరోనా బారిన పడిన జర్నలిస్టులకు రూ. 3 కోట్ల 56 లక్షల 70 వేలు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ఇప్పటివరకు 1640 మంది పాజిటివ్ వచ్చిన జర్నలిస్టులకు రూ. 20 వేల చొప్పున రూ. 3 కోట్ల 28 లక్షలు, హోం క్వారంటైన్‌లో ఉన్న 87 మంది జర్నలిస్టులకు రూ. 10 వేల చొప్పున మొత్తం రూ. 8 లక్షల 70 వేలు అందించినట్లు చెప్పారు. కరోనా సమయంలో అత్యవసర విధులు నిర్వహించిన పారిశుద్య కార్మికులు, వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బందితో సరి సమానంగా కరోనా గురించి వాస్తవ సమాచారం ప్రజలకు అందించడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి మూలధనం రూ. 34 కోట్ల 50 లక్షల నుంచి వచ్చిన వడ్డీతో మాత్రమే ఈ కార్యకలాపాలను నిర్వహించినట్లు వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి వచ్చిన వడ్డీతో ఇప్పటి వరకు మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం, పెన్షన్లు, ట్యూషన్ ఫీజులు, దీర&ఘకాలిక వ్యాధులు, ప్రమాదాల బారిన పడిన జర్నలిస్టులకు రూ. 50 వేల చొప్పున ఆర్థిక సహాయంతో పాటు కరోనా విపత్తు సాయం అన్నీ కలిపి ఇప్పటి వరకు జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 9 కోట్ల 50 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇలాంటి సంక్షేమ నిధి కాని, జర్నలిస్టులను ఆదుకోవడం గాని దేశంలో ఎక్కడా లేదన్నారు. భవిష్యత్తులో కూడా శిక్షణ, సంక్షేమం అనే రెండు కార్యక్రమాలను లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి పని చేస్తుందని అల్లం నారాయణ పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



ఖమ్మం, జనవరి 21 : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్తుపల్లి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మంత్రిప్రగడ సత్యనారాయణ (45) మృతి చెందారు. సత్తుపల్లి కోర్టులో పని పూర్తి చేసుకుని ఖమ్మంకు కారులో వస్తుండగా.. ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో సత్యనారాయణ మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలోని కరెంట్ ఆఫీస్ సమీపంలో జరిగిన మరో ప్రమాదంలో దంత వైద్యుడు కిరణ్ కుమార్ (35) మృతి చెందాడు. కిరణ్ కుమార్ ఖమ్మం నుంచి ఇల్లందుకు మోటార్ సైకిల్ పై వస్తుండగా.. ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో అదుపు తప్పి పడిపోయి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాట మారుతున్న సమీకరణాలు

కమలహాసన్‌కు కాంగ్రెస్ ఆహ్వానం

చిన్నమ్మ ప్రభావం ఏ మేరకు అన్నది నేతల అంచనా

చెన్నై,జనవరి 21(ఆర్‌ఎన్‌ఎ): ఎన్నికల కు మరికొంతం కాలమే ఉండడంతో తమిళనాట రాజకీయయ వేడి అంటుకుంది. తలైవా రజనీకాంత్ తప్పుకోవడంతో ఆయా పార్టీలకు కొంత ఊరట దక్కింది. తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళ త్వరలోనే విడుదల అవుతారని ఆశిస్తున్నారు. ఆమెను అన్నాడిఎంకెలోకి రానిచ్చేది లేదని సిఎం పళనిస్వామి చెప్పినా ఆ పార్టీలో ఆమె ప్రభావం తప్పకుండా ఉంటుంది. మరోవైపు తమ కూటమిలో కమల్‌హాసన్ చేరితే స్వాగతిస్తామని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి అన్నారు. మూడు కొత్త వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా తొలిసారిగా గళం విప్పింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. కానీ, సీఎం ఎడప్పాడి తాను రైతునేనని, ఆ చట్టాలు మేలు చేస్తాయని చెప్పడం సరికాదన్నారు. ఈ చట్టాల అమలు తో వ్యవసాయ రంగం కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళుతుందన్నారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు అసెంబ్లీ ఎన్నికల్లో పునరావృతమవుతాయన్నారు. ఇకపోతే శశికళ రాజకీయాలను దినకరన్ దగ్గరుండి చూసే అవకాశాలు ఉన్నాయి. ఆమె ఎలాంటి స్టెప్ వేస్తారన్నది కూడా ముఖ్యమే. స్థానిక పోయెస్‌గార్డెన్‌లోనే నివాసముం డాలని ఆమె నిర్ణయించుకున్నారు. ఇందుకోసం జయలలిత నివాసం 'వేద నిలయం' ఎదురుగా సుమారు 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనం నిర్మితమవుతోంది. ఈ నెల 27న పరప్పన అగ్రహారం జైలు నుంచి శశికళ విడుదలవుతున్న నేపథ్యంలో అప్పటికి ఈ భవనం సిద్ధం కాకపోవచ్చన్న అనుమానంతో టీనగర్‌లో ఆమె బంధువుల ఇంటి ఎదురుగా మరో భవనాన్ని తాత్కాలికంగా ఎంపిక చేశారు. అక్కడి నుంచే శశికళ కార్యకలాపాలు నిర్వహిస్తారని సమాచారం. శశికళ జైలు నుంచి విడుదలయ్యే రోజు వెయ్యి వాహనాలతో వెళ్లి స్వాగతం పలకాలని ఆమె సమీప బంధువు టీటీవీ దినకరన్ బృందం నిర్ణయించింది. బెంగుళూరు నుంచి చెన్నై వరకూ అడుగడుగునా స్వాగత సత్కారాలు జరిగేలా ఏర్పాట్లు చేపట్టారు. కాగా, మెరీనా తీరంలో సిద్ధమవుతున్న జయలలిత స్మారకమం దిరాన్ని ప్రారంభించాలని తమిళనాడు ప్రభుత్వం నిర్ణయించింది. రూ.53 కోట్లతో స్మారక మందిరం నిర్మిస్తున్నారు. జయలలిత నివాస భవనం 'వేద నిలయం'ను కూడా అదే రోజు ప్రారంభించాలని ముఖ్యమంత్రి పళనిస్వామి నిర్ణయించారు. శశికళ జైలు నుంచి విడుదలయ్యే రోజునే ఈ రెండిటినీ ప్రారంభిస్తుండటం గమనార్హం. మరోవైపు, అక్రమాస్తుల కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న శశికళ నటరాజన్ అనారోగ్యానికి గురయ్యారు. దీంతోబౌరింగ్ లేడీ కర్జన్ మెడికల్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. మొత్తంగా తమిళనాట ప్రజలు ఎవరిని ఆదరిస్తారన్నది చూడాలి.

రాహుల్ కాదంటే అశోక్ గెహ్లాట్

కాంగ్రెస్ అధ్యక్ష పదవిపై జోరుగా ఊహాగానాలు

న్యూఢిల్లీ,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పీఠం రాహుల్ గాంధీకే అప్పగించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనే పార్టీ పగ్గాలు చేపట్టాలని ఇప్పటికే పార్టీ నేతలంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. ఒకవేళ పార్టీ బాధ్యలు తీసుకునేందుకు ఆయన వెనుకంజ వేస్తే పార్టీలోని సీనియర్ నేత, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌కు అప్పగిం చనున్నట్లు సమాచారం. సారథ్య బాధ్యతలను తీసుకు నేందుకు ఇప్పటి వరకు రాహుల్ అంగీకరించలేదు. గాంధీ కుటుంబానికి నమ్మకమైన వ్యక్తిగా ఉన్న అశోక్ గెహ్లాట్ పేరును ప్రత్యామ్నాయంగా పరిశీలిస్తోంది. మరో వైపు ఆయన తన మంత్రి వర్గాన్ని విస్తరించే యోచనలో ఉన్నారు. పార్టీ సమావేశం అధినేత్రి సోనియా గాంధీ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం వర్చువల్ విధానంలో జరుగనుంది. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడి ఎంపికతో పాటు, సంస్థాగత ఎన్నికలపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గత లోక్‌సభలో పార్టీ ఘోర పరాజయం పాలవడంతో పార్టీ బాధ్యతల నుంచి రాహుల్ గాంధీ తప్పుకున్నారు. దీంతో తాత్కాలిక బాధ్యతలను సోనియాగా ంధీకి అప్పగించారు. పలువురు మద్దతుదారులు రాజీనామా వెనక్కి తీసుకొని.. బాధ్యతలు స్వీకరించాలని రాహుల్‌ను ఒప్పించే ప్రయత్నం చేసినా.. ఇందుకు అంగీకరించలేదు. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో పార్టీ పెద్దగా ప్రభావం చూపకపోవడంతో పలువురు సీనియర్ నేతలు పార్టీలో సమూల మార్పులు చేయాలని, కొత్త అధ్యక్షుడిని నియమించాలని, అంతర్గత ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ సెప్టెంబర్‌లో 23 మంది నేతలు పార్టీ నాయకత్వానికి లేఖాస్త్రం సంధించిన విషయం తెలిసిందే. గత నెలలో లేఖలు రాసిన నేతలతో కాంగ్రెస్ అధినేత్రి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీనియర్ నేతలు రాహుల్ సిద్ధంగా లేకుంటే, ఒకరిని శాశ్వత అధ్యక్షుడిగా చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తాత్కాలిక అధ్యక్షురాలుగా కొనసాగుతున్న సోనియా సైతం అనారోగ్య పరిస్థితుల్లో పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకునేందుకు సిద్ధంగా లేరు. ఈ క్రమంలో రాహుల్‌కు ప్రత్యామ్నాయంగా సారథ్య బాధ్యతలు అప్పగించేందుకు పార్టీ అధినాయకత్వం సీనియర్ నేత అయిన అశోక్ గెహ్లాట్ వైపు మొక్కు చూపుతున్నట్లు తెలుస్తోంది. నాటి, నేటి తరం నేతలను మంచి అనుసంధాన కర్తగా ఉంటారని పేరుంది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్ష పీఠం కోసం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే గత ఏడాది సైతం గెహ్లాట్‌కు పార్టీ బాధ్యతలు ఇస్తారని ప్రచారం జరిగినా.. తాను సీఎం పదవిని వదులు కునేందుకు సిద్ధంగా లేనని అన్నట్లు సమాచారం. ఇంతకు ముందు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గెహ్లాట్ ఢిల్లీకి వచ్చారు. గత రాజస్థాన్ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడంతో సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇద్దరు నేతలు బాధ్యతలు తీసుకునేందుకు విముఖ వ్యక్తం చేస్తే బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారన్నది ఆసక్తికరంగా ఉంది. ఈ క్రమంలో శుక్రవారం జరిగే వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు ఎవరన్నది స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

అభివృద్ధికి బిజెపి సహకారంపై శ్వేతపత్రం ఇవ్వండి

కరీంనగర్,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఏమీ చేయలేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బీజేపీని ఘాటుగా విమర్శించారు. నిధులు విషయంలో దేశంలోని అన్ని రాష్ట్రాలను సమానంగానే చూడాలని తలసాని కేంద్రానికి హితవు పలికారు. గురువారం కరీంనగర్‌లోని ఎల్‌ఎండి గెస్ట్‌హౌస్‌లో బిసి సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్,మేయర్ సునీల్ రావుతో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రానికి రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో అధిక నిధులు వెళుతున్నా కేంద్రం నుంచి రాష్ట్రానికి దానిలో సగం నిధులు కూడా రావడం లేదన్నారు. కరోనా సమయంలో కూడా తెలంగాణను కేంద్రం ఆదుకోలేదని ఆయన అన్నారు. తెలంగాణ ఏమీ పాకిస్తాన్‌లోలేదని, భారతదేశంలోనే తెలంగాణ కూడా అంతర్భాగమనే విషయాన్ని రాష్ట్ర బీజేపీ నాయకులు గమనించాలని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర బీజేపీ నాయకులు కేంద్రం నుంచి తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే బండి సంజయ్ విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. మోదీ చేస్తున్న అభివృద్ధిని మించి సీఎం కేసీఆర్ పేదల కోసం

సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాడన్నారు. దేశ చరిత్రలో రైతుబంధు, రైతు భీమా అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని బీజేపీ విమర్శించడం సిగ్గుచేటు మండిపడ్డారు. కాళేశ్వరంకు జాతీయ హోదా అడిగితే ఇవ్వలేదు. కేంద్రం తెలంగాణలో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని మంత్రి తలసాని డిమాండ్ చేశారు. రాష్ట్రాభివృద్ధిని చూసి ఏడవడం తప్ప తెలంగాణకు బీజేపీ ఏమైనా చేసిందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో గంగ పుత్రుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మత్స్య కారుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి

కరీంనగర్‌లో మంత్రి గంగుల, మేయర్ లతో కలసి మీడియాతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

తెలంగాణలకు కేంద్రం ఏం చేసిందో చెప్పండి

కనీసం కాళేశ్వరం జాతీయ ప్రాజెక్టుగా గుర్తించలేదు

బిజెపి ఏడ్పులు ఆపాలన్న మంత్రులు తలసాని,గంగుల

కేసీఆర్ నాయకత్వంలో అనేక కార్యక్రమాలు జరుగుతు న్నాయని తెలిపారు. గంగపుత్రుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ఉప్పల్ భగాయత్‌లో 3 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. ముదిరాజ్ భవన్ శంకుస్థాపన కార్యక్రమంలో ముదిరాజ్‌లను ఉత్తేజ పరిచే విధంగా మాత్రమే మాట్లాడానని అన్నారు. గంగ పుత్రులను బాధ పెట్టే విధంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. ఇప్పటకే ఈ విషయం పై గంగపుత్ర సంఘం ప్రతినిధులతో జరిగిపిన సమావేశంలో వివరించినట్టు వెల్లడించారు. అత్యధికంగా వెనుకబడిన వర్గాల ప్రజలు కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కుల వృత్తులకు చేయూతనందించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తెలిపారు. కులవృత్తులకు రూ.వెయ్యి కోట్లతో ప్రభుత్వం చేయూతనందిస్తున్నదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభివృద్ధికోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని బీజేపీ విమర్శించడం తగదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆపార్టీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అడిగితే ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గంగపుత్రుల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గంగపుత్రుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తున్నదని వెల్లడించారు. త్వరలోనే గంగపుత్ర భవన్‌కు శంకుస్థాపన చేస్తామన్నారు. తన వ్యాఖ్యలను గంగపుత్రులు తప్పుగా అర్థం చేసుకోవద్దని కోరారు. కుల వృత్తులకు రూ.1,000 కోట్లతో చేయూతనిస్తున్నామని తెలిపారు. గంగపుత్ర భవన్‌కు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. గంగపుత్రులు ఎవరు ఆందోళన చెందవద్దు. తన మాటలను తప్పుగా అర్థం చేసుకోవద్దన్నారు. వెనుక బడిన కులాలందరికి త్వరలో ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తామని స్పష్టం చేశారు. కాళేశ్వరం జలాలతో తెలంగాణ పచ్చగా మారింది. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ..తండ్రికి తగ్గ తనయుడు కేటీఆర్. అన్నారు. సీఎంగా కేటీఆర్‌కు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. మా అధినేత కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకున్నా దానిని అన్ని విధాల స్వాగతిస్తామని పేర్కొన్నారు. సీఎం అంశం మా పార్టీ అంతర్గత విషయమన్నారు. ఐటీ మినిస్టర్‌గా కేటీఆర్ తెలంగాణకు అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు తెచ్చి తన ప్రతిభను నిరూపించుకున్నారని తెలిపారు.

కళా వెంకట్రావ్ అరెస్ట్ అక్రమం

40ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క కేసైనా ఉందా

సర్కార్ తీరును దుయ్యబట్టిన మాజీమంత్రి ప్రత్తిపాటి

వెంకులు హత్యపై పోలీసులు తీరు దారుణమన్న యరపతినేని

గుంటూరు,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): మాజీ మంత్రి కళా వెంకట్రావు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క కేసు కూడా లేని నాయకుడు కళా వెంకట్రావు అని తెలిపారు. దొంగలను, తీవ్రవాదులను అరెస్ట్ చేసినట్టు కళాను అరెస్టు చేయడం దుర్మార్గామని మండిపడ్డారు. పంచాయతీ ఎన్నికలను యధావిధిగా జరపాలని కోర్ట్ తీర్పు ఇచ్చిందని... ఇన్సైడ్ ట్రేడింగ్ జరగలేదని కోర్ట్ స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. కోర్ట్ తీర్పులను తాము స్వాగతిస్తున్నామని పుల్లారావు తెలిపారు. ఇదిలావుంటే సంచలనం సృష్టించిన మాజీ సర్పంచ్ అంకులు హత్య కేసులో పోలీసులు కొండను తవ్వి ఎలుకను పట్టారని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు ఆరోపించారు. ఈ హత్య కేసులో రాజకీయ కోణం లేదని ఎస్పీ విశాల్ గున్ని ఎలా చెప్పారని ఆయన ప్రశ్నించారు. ఈ కేసులో చాలా మంది నిందితులను వదిలేశారని ఆయన పేర్కొన్నారు. ఎస్పీపై ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఇలా కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శిం చారు. హత్య కేసులో అరెస్టైన వెంకట కోటయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి లు వైసీపీ నేతలు కాదా అని ప్రశ్నించారు. అనుమానితుడిగా ఉన్న మరో వైసీపీ నేత అప్పిరెడ్డిని విచారించి ఎందుకు వదిలేశారని ఆయన పేర్కొన్నారు. అంకులును హత్య చేయడానికి పథక రచన చేసి డబ్బులు వసూలు చేసింది వైసీపీ నేతలు కాదా అని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే కాసు మహేష్ ప్రోద్బలంతోనే అంకులు హత్య జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ హత్య కేసులో ఎస్సై బాల నాగిరెడ్డి తో పాటు అనేక మందిపై అనుమానంగా ఉందని ఎస్పీ విశాల్ కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎస్పీ విశాల్ సరిగా వ్యవహరించి అంకులు హత్య కేసును విచారించాలని కోరారు. అలాగే ఎస్సై బాలనాగిరెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ఇతర నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. అంకులు హత్యపై హక్కుల సంఘానికి కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. రాష్ట్రంలో పోలీసులను అడ్డుపెట్టుకుని సీఎం జగన్ ఆటవిక పాలన చేస్తున్నారని ఆయన విమర్శించారు.

నిర్మల్‌లో పూర్తి కావస్తున్న టిఆర్ఎస్ భవనం

-నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి ఇంద్రకరణ్

నిర్మల్,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): నిర్మల్, కొండాపూర్‌లో గల టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని గురువారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సందర్శించారు. టీఆర్ఎస్ భవన్‌లో జరుగుతున్న పనులను దగ్గరుండి క్షుణ్ణంగా పరిశీలించారు.

భవన్‌లో మరికొన్ని చెట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు అనువైన ప్రదేశం చూసి విగ్రహం ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మల్ జిల్లాకు విచ్చేయనున్నారని, తెలంగాణ భవన్ ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

భవన్‌లోని ఆడిటోరియాన్ని పెండ్లిళ్లకు, శుభకార్యాలకు ఇవ్వడం ద్వారా వచ్చే డబ్బును భవన్‌లో పని చేసే వారికి ఉపయోగిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజి రాజేందర్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ డాక్టర్ సుభాష్ రావు, మాజీ డిసిసిబి చైర్మన్ రాంకిషన్ రెడ్డి, కొండాపూర్ సర్పంచ్ గంగాధర్,నాయకులు గండ్రత్ రమేష్, దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

-కొనసాగుతున్న ఎత్తి పోతలు

పెద్దపల్లి,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): కొద్ది రోజులుగా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది.

దీని నుంచి ఈ ప్రాజెక్టులో భాగంగా పెద్దపల్లి జిల్లాలో నిర్మించిన నంది మేడారం పంప్ హౌస్ లోకి నిరంతరాయంగా నీటిని ఎత్తిపోస్తున్నారు. పంప్ హౌస్ లోని మూడు మోటర్ల ద్వారా లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్‌కు 9,450 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. ఇక్కడి నుంచి నీటిని మిడ్ మానేర్ రిజర్వాయర్ కు నీటిని తరలించే అవకాశం ఉంది. ఎండాకాలంలో కాళేశ్వరం కింద అన్ని చెరువులు, కుంటలు నింపాలని సీఎం కేసీఆర్ ఆదేశించడంతో నీటి విడుదలను కొనసాగిస్తున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-1, 2లలో ఆదివారం ప్రారంభమైన ఎత్తిపోతలు యథావిధిగా కొనసాగుతున్నాయి. మంగళవారం లింక్-1లో 9 పంపులు, లింక్-2లో రెండు పంపులతో నీటిని ఎత్తిపోశారు. లింక్-1లోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కన్నెపల్లిలోని లక్ష్మీ పంపుహౌస్‌లో 14, 15, 16, 17వ పంపులను నడిపిస్తూ 8, 800ల క్యూసెక్కుల నీటిని సరస్వతీ బరాజ్‌లోకి ఎత్తిపోస్తున్నారు.

పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాసిపేటలోని సరస్వతీ పంపుహౌస్‌లోని 9, 11వ పంపులను నడిపిస్తూ 6 వేల క్యూసెక్కుల నీటిని పార్వతీ బరాజ్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అంతర్గాం మండలం గోలివాడలోని పార్వతీ పంపు హౌస్‌లో మూడు మోటార్లను ఆన్‌చేసి 7,950 క్యూసెక్కుల నీటిని ఎల్లంపల్లిలోకి ఎత్తిపోస్తున్నారు. లింక్-2 పరిధిలోని ధర్మారం మండలం నందిమేడారం లోని నంది పంపుహౌస్‌లో ఒక మోటర్‌ను ఆన్‌చేసి 3,150 క్యూసెక్కులు, రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంపుహౌస్ వద్ద ఒక మోటర్ ద్వారా శ్రీరాజరాజేశ్వర జలాశయానికి, అక్కడి నుంచి గేట్ల ద్వారా అంతే మొత్తంలో ఎల్ఎండీకి తరలిస్తున్నారు.

శివన్నగూడెం రిజర్వాయర్ పనుల్లో అపశృతి

-టిప్పర్ ఢీకొని సూపర్‌వైజర్ వెంకటేశ్ మృతి

నల్గొండ,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): జిల్లాలోని మర్రిగూడ మండలం శివన్నగూడెం రిజర్వాయర్ పనుల్లో జరిగిన ప్రమాదంలో టిప్పర్ ఢీకొని సూపర్‌వైజర్ వెంకటేష్ (33)మృతి చెందాడు. కొన్ని రోజులుగా రిజర్వాయర్ పనుల్లో వేగం పెరిగింది. దానిలో భాగంగా టిప్పర్‌తో మట్టి, కంకర తదితర వాటిని రవాణా చేస్తున్నారు. ఈ రోజు సూపర్‌వైజర్ వెంకటేష్ రిజర్వాయర్ పనులను పర్యవేక్షిస్తున్నాడు. అదే సమయంలో నిర్లక్ష్యంతో వేగంగా డ్రైవర్ టిప్పర్ ను నడిపి వెంకటేష్ ను ఢీ కొట్టాడు. దీంతో సూపర్‌వైజర్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు వెంకటేష్ మృతి చెందాడు. ఈ సమాచారాన్నిమృతిడి కుటుంబ సభ్యులకు తోటి ఉద్యోగులు అందించారు. వారి రోదనలతో రిజర్వాయర్ ప్రాంతమంతా నిండిపోయింది. దీంతో కార్మికుల్లో తీవ్ర విషాదం నెలకొంది. తమ కుటుంబానికి ఆధారమైన వెంకటేష్ చనిపోవడంతో తమకు న్యాయం చేయాలంటూ మర్రిగూడెం పీఎస్ ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ద్వారకా తిరుమలను దర్శించుకున్న నిమ్మగడ్డ

ఏలూరు,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమల వెంకన్నను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ సందర్శించారు. ఆలయ మర్యాదలతో స్వామి వారి దర్శనాన్ని అధికారులు కల్పించారు. ఆలయంలో అరగంట సేపు ఆయన ధ్యానం చేసినట్టు సమాచారం. స్థానిక ఎన్నికలపై రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువరించిన అనంతరం ఆయన ద్వారకా తిరుమలను దర్శించడం విశేషం. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తీవ్ర వాదోపవాదాల అనంతరం ఉన్నత న్యాయస్థానం ఇవాళ తీర్పు వెలువరించింది. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషనర్ సమన్వయంతో ఎన్నికలు నిర్వహించాలని తన తీర్పులో ధర్మాసనం పేర్కొంది.

హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

అప్పుడు కరోనా ఉన్నా ఎన్నికలు కావాలన్నారు

ఇప్పుడు వద్దనడంలో ఆంతర్యమేమిటో ?

హత్యలతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నారు

దేవాలయాలపై దాడులు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా?

మడియా సమవేశంలో టిడిపి అధినేత చంద్రబాబు

అమరావతి,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఏపీ హైకోర్టు కీలక వెల్లడించిన తీర్పును టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వాగతించారు. గురువారం నాడు అమరావతిలో మీడియా మీట్ నిర్వహించిన ఆయన.. హైకోర్టు తీర్పును స్వాగతించారు. ఇప్పటి వరకూ మనసు చంపుకుని పనిచేస్తున్న అధికారులకు గట్టిగా పనిచేయడానికి పంచాయతీ ఎన్నికలు రూపంలో అవకాశం వచ్చిందని వ్యాఖ్యానించారు. 'ఎప్పుడైనా 24 శాతం ఏకగ్రీవమైన పరిస్థితి రాష్ట్రంలో ఉందా?. అప్పుడు కరోనా ఉన్నా ఎన్నికలు కావాలన్నారు.. ఇప్పుడు వద్దంటున్నారు.

ఓ వైపు కౌన్సిల్ రద్దు అంటూనే మరో వైపు నామినేషన్ వేయిస్తారా?. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు కూడా సీఎం జగనే పెడతానంటారేమో?. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఛానళ్లను కట్ చేస్తారా? వాటికి ప్రత్యామ్నాయం ఉంటుంది. డీజీపీ యూనిఫామ్‌కు గౌరవం ఇవ్వాలి. జడ్జిలు మారినంత మాత్రాన న్యాయం మారదు' అని చంద్రబాబు చెప్పుకొచ్చారు. కళావెంకట్రావును అరెస్ట్ చేసి.. కేసు పెట్టిన విధానం దారుణమన్నారు. అబ్దుల్ సలాం కుటుంబం మరణం పోలీస్ వ్యవస్థకు సిగ్గుచేటుగా నిలిచిందని విమర్శించారు. మీ చర్యలకు భయపడే కోడెల వంటి గొప్ప వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. వైసీపీ ఎంపీ విజయసాయి తమ ప్రోగ్రాంను డిస్టర్బ్ చేయడానికి వస్తే.. అక్కడి భక్తులు అడ్డుకుంటే కళావెంకట్రావుపై కేసు పెడతారా? అని చంద్రబాబు ప్రశ్నించారు.

పాస్టర్ ప్రవీణ్ ఎక్కడ ఉన్నాడు?.. ఆయనకు ఎందుకు స్పెషల్ ట్రీట్మెంట్ చెప్పాలని డిమాండ్ చేశారు. దేవినేని ఉమను నిన్న పోలీసులు ఏం చేశారని ప్రశ్నించారు. దేవినేని ఉమను ఒక రౌడీ మంత్రి.. ఆయన ఇంటికి వెళ్లి కొడతా అంటారా? ఒక సీఎం, ఒక డీజీపీ, ఒక హోమ్ మినిస్టర్, ఒకే మతం వాళ్ళు ఉంటే ఏం జరుగుతుందో చెప్పాలన్నారు. డీజీపీ తానొక మోనార్క్‌లా వ్యవహరిస్తున్నారు. పాస్టర్ ప్రవీణ్‌ను మీరెందుకు రహస్య ఎంక్వైరీ చేస్తున్నారు. నిన్న మేరీ క్రిస్టియన్‌లతో ప్రెస్ మీట్ పెట్టించి నన్ను క్షమాపణలు చెప్పమంటారా? మీరు దేవుళ్ళ విగ్రహాలు ధ్వంసం చేస్తుంటే..అది మేము అడగకూడదా...? జగన్ నువ్వొక క్రిస్టియన్ చీఫ్ మినిస్టర్... నువ్వు హిందు దేవాలయాలను ఎందుకు కాపాడతావు? నందం సుబ్బయ్య హత్య లాంటివి రాష్ట్రంలో ఎన్నో హత్యలు జరుగుతున్నాయి. ప్రకాశంలో ఒక జనసేన కార్యకర్త ఎమ్మెల్యేను ప్రశ్నిస్తే... ఆ తరువాత ఆయన మరణం ఎలా జరిగిందో తేల్చాలి. డీజీపీ తన పదవి కోసం జగన్‌కు సరెండర్ అయ్యారు. టీడీపీ పోరాటం ప్రజల కోసం... మా కోసం కాదు. గుడివాడ ఎస్ఐ ఆత్మహత్య వెనుక ఉన్న రహస్యం ఏంటి? పేకాట శిబిరాల దాడుల్లో ఆయన పాల్గొన్నారని పేర్కొన్నారు.

హైకోర్టు తీర్పుపై సిఎం జగన్ సమీక్ష

సుప్రీంలో సవాల్ చేసే అవకాశం?

అమరావతి,జనవరి21(ఆర్‌ఎన్‌ఎ): స్థానిక ఎన్నికల నిర్వహణ చేపట్టాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో దీనిపై సుప్రీంలో సవాల్ చేయాలని ఎపి ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికప్పుడు ఎన్నికలు నిర్వహించలేమని గతంలో ప్రభుత్వం కోర్టుకు తెలిపింది.

దీంతో తీర్పు వెలువడగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు. అందుబాటులో ఉన్న మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సీఎం భేటీ అయ్యారు. ఈ సమావేశానికి మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స సత్యనారాయణ, కొడాలి నాని, పేర్ని నానిలతో పాటు సీనియర్ నేతలు హాజరయ్యారు. సమావేశంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి హైకోర్టు కీలక తీర్పుపై చర్చించారని సమాచారం. హైకోర్టు తీర్పుపై ఎలా ముందుకెళ్లాలి..? సుప్రీంకోర్టుకు వెళ్లాలా..? లేకుంటే షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలా..? అనేదానిపై చర్చించినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఏపీ హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. పంచాయతీ ఎన్నికలు కొనసాగించాలని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసిన ధర్మాసనం.. ప్రజారోగ్యం, ఎన్నికలు రెండూ ముఖ్యమేనని ఎవరికీ ఇబ్బంది లేకుండా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ కీలక తీర్పుపై ఇప్పటికే ఒకరిద్దరు మంత్రులు స్పందిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పుకొచ్చారు. మరోవైపు.. బీజేపీ, టీడీపీ ప్రముఖ నేతలు మాత్రం ఈ తీర్పును స్వాగతించారు. ఇదిలా ఉంటే.. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి స్పందిస్తూ.. హైకోర్టు తీర్పును సుప్రీంలో సవాల్ చేస్తామన్నారు. మేం ఆశించిన విధంగా హైకోర్టు తీర్పు లేదని.. ఉద్యోగుల్లో కరోనా భయం ఉందని వెల్లడించారు.

'జై హింద్'ను శ్వాసించిన 'నేతాజీ'

(23 జనవరి 'పరాక్రమ్ దివస్: నేతాజీ సుభాస్‌చంద్ర బోస్ జన్మదినం' సందర్భంగా)

నేతాజీ జన్మదినోత్సవాలను 23 జనవరి 2021 నుంచి "పరాక్రమ్ దివస్"గా ఘనం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ నిర్ణయించింది. నేతాజీ సుభాస్ చంద్ర బోస్ 125వ జయంతి (క్వాస్విసెంటానియల్ సెలబ్రేషన్స్) ఉత్సవాలను 23 జనవరి 2021 నుంచి వచ్చే ఏడాది 23 జనవరి 2022 వరకు పరాక్రమ్ దివస్‌ను ఘనంగా నిర్వహించేందుకు భారత ప్రభుత్వం ఏర్పాట్లు ప్రారంభించడం హర్షదాయకం. నేతాజీ జయంతిని 'దేశ్ ప్రేమ్ దివస్'గా కూడా జరుపుకునే ఆనవాయితీ గతంలో ఉండేదని మనకు తెలుసు. 125వ జయంతిని సంవత్సరం పాటు నిర్వహించి నేతాజీ దేశభక్తి, ధైర్యసాహసాలు, అకుంఠిత దీక్ష, నిస్వార్థ పోరాట పటిమ, వలసపాలన వ్యతిరేక ఆవేశ పోరాట పటిమను నేటి ప్రజలకు, ముఖ్యంగా యువతకు ప్రేరణగా చూపాలనే ప్రయత్నాలను చేయడం ముదావహం. ఈ ఉత్సవాలలో భాగంగా నాణెం మరియు పోస్టల్ స్టాంపులను విడుదల చేయడానికి కూడా ఏర్పాట్లు చేయడం జరిగింది. నేతాజీ 125వ జయంతి ఉత్సవ కమిటీకి ప్రధానమంత్రి అధ్యక్షత వహిస్తుండగా, 85 మంది సభ్యులుగా చరిత్రకారులు, నిపుణులు, దేశభక్తిగల పౌరులు, రచయితలు, బోస్ కుటుంబ వారసులు మరియు ఆజాద్ హింద్ ఫౌజ్ అభిమానులను తీసుకోవడం జరుగుతున్నది. ఢిల్లీ, విక్టోరియా టర్మినల్ – కలకత్తా, జన్మస్థలం – కటక్, హరిపురా–గుజరాత్ మరియు నేతాజీకి సంబంధం ఉన్న ప్రదేశాలలో ఏడాది పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. బోస్ జీవితానికి సంబంధించిన రహస్య పత్రాలను ప్రజల ముందు ఉంచాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 133 ఫైల్‌లను 2015 – 16లో బహిరంగ పరచడం జరిగింది. 2019లో అండమాన్‌లోని 3 ద్వీపాలకు నేతాజీ సుభాస్ చంద్ర బోస్ ద్వీపం, షహీద్ ద్వీపం మరియు స్వరాజ్య ద్వీపమని నామకరణం కూడా చేయడం జరిగింది.

23 జనవరి 1897న కటక్‌లో ప్రభావతి మరియు జానకినాథ్ బోస్‌లకు జన్మించిన సుభాస్ చంద్ర బోస్ విద్యాభ్యాసం కటక్, కలకత్తా (బి.ఏ. ఫిలాసఫీ) మరియు లండన్ – కేంబ్రిడ్జ్ (బి.ఏ. మెంటల్ అండ్ మోరల్ సైన్స్)ల్లో పూర్తి చేశారు. తండ్రి ప్రోద్భలంతో లండన్‌లో ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి ఎంపికైనారు. బ్రిటీష్ ప్రభుత్వంలో పని చేయడం ఇష్టం లేక ఆ ఉద్యోగానికి రాజీనామా చేసిన సుభాస్ చంద్ర బోస్ మనందరికీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. దేశభక్తిని ఒంటి నిండా నింపుకున్న సుభాస్ చంద్ర బోస్ వలసపాలనకు వ్యతిరేకంగా 2వ ప్రపంచయుద్ధ సమయంలో నాజీ జర్మనీ మరియు జపాన్‌ల పక్షాన నిలిచి, వారి సహాయం తీసుకోవడం జరిగింది. భారత జవాన్లు ముద్దుగా 'నేతాజీ' అని పిలవడంతో తనకు అది బిరుదులా మారింది. కలకత్తా మేయర్‌గా (1930 – 31) సేవలు అందించిన బోస్ జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మరియు భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా (1938 – 39) పని చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఉద్యమ సంస్థలతో రహస్య సంబంధాలు కలిగి ఉన్నారనే కారణంగా అనేక సార్లు అరెస్టులు కూడా అయ్యారు. 1920 – 34ల మధ్య జరిగిన భారత స్వాతంత్ర్య పోరాటంతో కూడిన పుస్తకం 'ది ఇండియాస్ స్ట్రగుల్'ను రచించారు.

మహాత్మాగాంధీతో విభేదించి కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించి దాని ప్రథమ అధ్యక్షుడిగా (1939 – 41) బాధ్యతలు నిర్వహించారు. 1940లో బ్రిటీష్ ప్రభుత్వం గృహనిర్బంధం విధించిన వేళ తప్పించుకొని 1941లో జర్మనీ చేరారు. తన సహచరి ఎమిలీని వివాహమాడి కూతురికి జన్మనిచ్చారు. అడాల్ఫ్ హిట్లర్ సహాయంతో జపాన్‌కు చేరి 40,000 మంది భారతీయ యువకులతో కూడిన 'భారత జాతీయ ఆర్మీ' స్థాపించి శిక్షణను ఇచ్చారు. తన ఆర్మీతో కలిసి దేశ స్వాతంత్ర్యం కోసం 'జై హింద్' నినాదంతో సాయుధ పోరాటం చేయ సంకల్పించారు. 1944 – 45లో జరిగిన 2వ ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ ఇండియన్ ఆర్మీతో పోరాటంలో తన ఆర్మీలో సగం ప్రాణాలు కోల్పోవడం జరిగింది. రష్యాకు వెళ్లే ప్రయత్నంలో విమానం తైవాన్/తైపీ ప్రాంతంలో కూలిపోవడంతో శరీరం 3వ డిగ్రీ బొబ్బలతో 18 ఆగష్టు 1945న అనుమానాస్పద స్థితిలో తుది శ్వాస విడిచారు. కాని నేతాజీ అలా మరణించలేదని, తన మరణవార్త వెనుక కుట్రకోణం ఉందని గట్టిగా నమ్మేవారు కూడా ఉన్నారు. గాంధీ సమకాలీనుడైన బోస్ కొన్ని సందర్భాలలో గాంధీ చేపట్టిన ఉద్యమాల్లో పాల్గొని మరికొన్ని సందర్భాలలో విభేదించే వారు. గాంధీ చేపట్టిన అహింసాయుత పోరాటానికి విరుద్ధంగా బోస్ సాయుధ పోరుతో స్వాతంత్ర్యం సాధించాలని కోరుకున్నారు.

నేటి యువశక్తిని దేశభక్తితో నింపడానికి నేతాజీ ఆదర్శ జీవితం ఉపయోగపడుతుందని నమ్ముదాం. 'మీరు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అని నినదించిన నేతాజీ సుభాస్ చంద్ర బోస్ త్యాగాలు అనన్యసామాన్యాలు, అసాధారణాలు, అనితరసాధ్యాలు మరియు అనుసరణీయాలు. నేతాజీ జీవితం ప్రతి భారతీయ యువతకు నిత్య ప్రేరణ కావాలని కోరుకుందాం, 'జై హింద్' అంటూ నినదిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఎపి సర్కార్‌కు మరో ఊహించని పరిణామం

స్థానిక ఎన్నికల నిర్వహణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్
సింగిల్ బెంచ్ ఉత్తర్వుల కొట్టివేత
ఇసికి అనుకూలంగా ధర్మాసనం తీర్పు

అమరావతి,జనవరి21(ఆర్ఎన్ఎ): ఎపి ప్రభుత్వానికి మరో ఊహించని పరిణామం ఎదురయ్యింది. స్థానిక ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశినస్తా ఎన్నికల సంఘానికి అనుకూలంగా తీర్పును ఇచ్చింది. గత కొన్నిరోజులుగా జగన్ సర్కార్ వర్సెస్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా పరిస్థితులు నెలకొన్న విషయం విదితమే. స్థానిక ఎన్నికలు ఇప్పట్లో వద్దని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పడం.. జరిగి తీరాల్సిందే అన్నట్లుగా ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఇలా ఇద్దరూ పంతాలకు పోయారు. ఈ వ్యవహారం చివరికి కోర్టు దాకా వెళ్లడంతో ఇవాళ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పునిచ్చింది.

గురువారం నాడు స్థానిక ఎన్నికలపై ఏపీ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. పంచాయతీ ఎన్నికలు కొనసాగించాలని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికలపై స్టే విధిస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేయడం జరిగింది. ఎస్ఈసీ దాఖలు చేసిన రిట్ అప్పీల్‌ను హైకోర్టు అనుమతించింది. ఈ సందర్భంగా ప్రజారోగ్యం, ఎన్నికలు రెండూ ముఖ్యమేనని.. ఎవరికీ ఇబ్బంది లేకుండా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సమన్వయంతో ముందుకు సాగాలని హైకోర్టు సూచించింది. కాగా.. ఈనెల 8న ఎన్నికల షెడ్యూల్‌ను ఎస్ఈసీ ప్రకటించింది. 11న ఎస్ఈసీ ఆదేశాలను హైకోర్టు సింగిల్ జడ్జి కొట్టేయగా.. ఈ ఆదేశాలపై ఎస్ఈసీ అప్పీల్‌కు వెళ్లింది. మూడ్రోజుల పాటు ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఎవరికీ ఇబ్బంది లేకుండా ఎన్నికలు నిర్వహించాలని ధర్మాసనం తీర్పునిచ్చింది. ఈ తీర్పును బీజేపీ నేతలు స్వాగతించారు. పంచాయతి ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభ పరిణామం అంటున్నారు. ఈ తీర్పుపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ స్పందించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం 4 దశల్లో ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. 'వచ్చే నెల 5, 9, 13, 17 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ఎన్నికల కోడ్ అమలులో ఉంది. సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ది ప్రజలను ప్రభావితం చేస్తుంది. ఈ విషయాన్ని సీఎస్ దృష్టికి తీసుకెళ్లాం. ఎన్నికలకు సహకరినిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. త్వరలో సీఎస్, డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహిస్తాం' అని ఎస్ఈసీ రమేష్ మీడియాకు వెల్లడించారు. గురువారం ఉదయం పశ్చిమ గోదావరి జిల్లాలోని ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయంలో రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరగంట సేపు ఆయన ధ్యానం చేశారు. అనంతరం హైకోర్టు తీర్పుపై మీడియాతో మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు.

కాగా ఈ తీర్పుపై ఇప్పటికే ప్రతిపక్ష పార్టీల నేతలు స్పందిస్తూ స్వాగతించారు. మరోవైపు.. హైకోర్టు తాజా తీర్పుపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టుకు వెళతామని మంత్రి పేర్నినాని తెలిపారు. నిమ్మగడ్డ అనుకున్నంత మాత్రన ఎన్నికల కోడ్ అమలు కాదని.. న్యాయమూర్తులు మారినా ధర్మం గెలవాలనే కోరుకుంటున్నామని పేర్నినాని పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలే ముఖ్యమని.. న్యాయ నిపుణులు, అధికారుల తో చర్చిస్తామన్నారు. ఇక అటు ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ సిద్ధమవుతోంది. పంచాయతీ ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి వచ్చినట్టేనని ఎస్ఈసీ అంటోంది. శనివారం నుంచి 4 విడతల్లో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్లు వెలువడనున్నాయి.

కంటికి కనిపించని సాంకేతిక అస్త్రాలను సంధిసూ

పోకిరీలకు దడపుట్టిస్తున్న షీబృందాలు

కరీంనగర్. జనవరి 21 (నేటినిజం ప్రతినిధి):మహిళలు, విద్యార్థినులకు భద్రతపై భరోసా కల్పించేచర్యల్లో భాగంగా పోకిరీల చర్యలను కంటికి కనిపించని రీతిలో ఉండే అత్యాధునిక సాంకేతిక పరికరాల అస్త్రాన్నిసంధిస్తూ కరీంనగర్ కమిషనరేట్‌లో షీబృందాలు ముందుకుసాగుతున్నాయి.

పోకిరీల చర్యలు ఈ సాంకేతిక పరికరాల్లో నిక్షిప్తం కావడంతో పోకిరీలు సదరు సాక్ష్యాధారాలతో శిక్షింపబడుతున్నారు. కమిషనరేట్‌వ్యాప్తంగా షీబృందాలకు చెందిన పోలీసులు మఫ్టీల్లో సంచరిస్తూ పోకిరీల అడ్డాలు, జనసమూహం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో గస్తీని నిర్వహిస్తున్నారు. కంటికికనిపించని రీతిలో ఉండే అత్యాధునిక సాంకేతిక పరికరాలను వినియోగిస్తుండటంతో పోకిరీలు శిక్షల నుండి తప్పించుకోలేకపోతున్నారు. షీబృందాల చర్యలు వినూత్నంగా కొనసాగిస్తున్న గస్తీలతో పోకిరీల గుండెల్లో దడపుట్టిస్తున్నాయి.

కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి షీబృందాల్లోని సభ్యులను మూడునెలలకు ఒకసారి మార్చడం, అత్యాధునిక సాంకేతిక పరికరాల వినియోగంపై ప్రతినెలా రెండుసార్లు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూ నైపుణ్యాన్ని పెంపొందించే చర్యలను కొనసాగిస్తుడటంతో షీబృందాలు ఆశించిన ఫలితాలను సాధిస్తున్నాయి. 2016 అక్టోబర్ 28న కమిషనరేట్‌లో షీబృందాలు ప్రారంభమైన విషయం విదితమే.

షీబృందాలకు చెందిన పోలీసులు మఫ్టీల్లో సంచరిస్తూ ముఖ్యకూడళ్ళు సంచరిస్తూ పోకిరీలను ఆధారాలతో సహాపట్టుకునేందుకు ఆధునిక సాంకేతక పరకరాలను వినియోగిస్తున్నారు.

వేధింపుల తీవ్రతను బట్టి తల్లిదండ్రుల సమక్షంలో ఆధారాలను చూపిస్తూ కౌన్సిలింగ్‌లను నిర్వహించడంతోపాటు నిర్భయ కేసులను నమోదుచేస్తూ షీబృందాలు పోకిరీలకు సింహస్వప్నంగా నిలుస్తున్నాయి.

<u>ఇప్పటి వరకు 2097మంది పోకిరీలు పట్టుబడ్డారు</u>

2016 నుండి ఇప్పటి వరకు షీబృందాలకు 2097మంది పోకిరీలు పట్టుబడ్డారు. ఇందులో 40మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, ఈ–పెట్టీ కేసులు 155, 579మందికి కౌన్సిలింగ్‌లు, వేధింపుల తీవ్రతస్థాయి తక్కువను బట్టి తల్లిదండ్రుల సమక్షంలో 1323మందిని హెచ్చరించి వదిలివేయడం జరిగింది. 16మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ–పెట్టి కేసులు 155 నమోదు చేశారు. షీబృందాలకు ఇంఛార్జిగా కరీంనగర్ మహిళ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.

వాట్సాప్, డయల్100, హాక్ఐ యాప్‌ల ద్వారా అందుతున్న ఫిర్యాదులు

గతంలో వివిధ రకాల పోకిరీలతో ఇబ్బందులను ఎదుర్కొన్న మహిళలు, విద్యార్థినులు ఇప్పుడు నేరుగా పోలీస్‌స్టేషన్‌లకు రాకుండానే వాట్సాప్, హాక్ఐ యాప్‌ల ద్వారా ఫిర్యాదులను చేస్తున్నారు. ఈ విధానం షీబృందాలు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల స్పందనకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఇప్పటి వరకు షీబృందాలకు 640 ఫిర్యాదులు అందగా ఇందులో నేరుగా 474, వాట్సాప్‌ద్వారా 131, డయల్ 100ద్వారా 16, ఫేస్‌బుక్ ద్వారా 06, హాక్ఐ యాప్ ద్వారా 13 ఫిర్యాధులు అందాయి. మహిళలు, విద్యార్థులు తమ ఇబ్బందులను ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించడం జరిగింది. షీబృందాల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు కమిషనరేట్‌లోని వివిధ ప్రాంతాల్లో 460 అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.

<u>హాక్ఐ యాప్ డౌన్‌లోడ్‌లో దూసుకపోతున్న కమిషనరేట్</u>

షీబృందాలు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలతో ఇప్పటి వరకు స్మార్ట్‌ఫోన్ కలిగిఉన్న 40వేలకుపైగా మంది మహిళలు, విద్యార్థినులు ఈ హాక్ఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

కమీషనరేట్ వ్యాప్తంగా ఈ యాప్‌ను వివిధ వర్గాలకు చెందిన ప్రజలు 01.70లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల తర్వాత కరీంనగర్ కమిషనరేట్ హాక్ఐ యాప్ డౌన్‌లోడ్‌లో రెండవస్థానంలో కొనసాగుతున్నది. షీబృందాలకు చెందిన పోలీసులు కమిషనరేట్ వ్యాప్తంగా వాడవాడల్లో తిరుగడమే కాకుండా మహిళలు ఎక్కువగా పనిచేసే వివిధ వ్యాపార,వాణిజ్య కేంద్రాలకు వెళ్ళి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు.

<u>ఫిర్యాదుల ఆధారంగా నేరుగా బాధితుల వెళుతూ సమస్యలను పరిష్కరిస్తున్నారు</u>

మహిళలు, విద్యార్థినిలు నేరుగా ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా సెల్‌ఫోన్,వాట్సాప్,ట్విట్టర్ ద్వారా ఫిర్యాదులు అందుతున్నాయి. ఫిర్యాదు చేసిన మహిళలు,విద్యార్థుల పేర్లను గోప్యంగా ఉంచడంతోపాటు, వారిని పోలీస్‌స్టేషన్లకు రమ్మనకుండా షీబృందాల పోలీసులు బాధిత మహిళల వద్దకు వెళ్ళి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు.ఈ విధానం ద్వారా మహిళల్లో భద్రతాభావం పెంపొందుతున్నది. 9440795182కు వాట్సాప్ ఫిర్యాదులు చేసేందుకు ప్రత్యేక నెంబర్‌ను కేటాంచారు. బాధిత మహిళలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వేధింపులు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో షీబృందాల పనితీరుతీరుతో తగ్గుముఖం పడుతున్నాయి.

<u>నిర్భయంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకురావాలి –పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి</u>

వివిధ రకాల వేధింపులను ఎదుర్కొనే మహిళలు, విద్యార్థినిలు నిర్భయంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకురావాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కోరారు. షీబృందాలకు చెందిన పోలీసులు వివరాలను గోప్యంగా ఉంచి బాధితులకు న్యాయం చేస్తారని పేర్కొన్నారు. వివిధ రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్న మహిళలు, విద్యార్థినులు తమ ఇబ్బందులను తెలుపకుండా మౌనంగా భరించడం సరైందికాదని, మౌనంగా భరిస్తూఉంటే ఇలాంటి చర్యలు పునరావృతం అయ్యేప్రమాదం ఉందని హెచ్చరించారు. పోకిరీల ఆగడాలను నియంత్రించేందుకు మరింత పగడ్బందీచర్యలతో ముందుకుసాగాలని షీబృందాలకు చెందిన పోలీసులను ఆదేశించారు.

తెలంగాణకు కేంద్రం అభినందనలు

హైదరాబాద్, జనవరి 21: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అభినందనలు తెలిపింది. వందశాతం ఫంక్షనల్ ట్యాప్ కనెక్షన్ రాష్ట్రంగా తెలంగాణ నిలవడంపై కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ.. ఇప్పటివరకు వంద శాతం ఎఫ్‌హెచ్‌టీసీ పూర్తి చేసిన రాష్ట్రాలుగా గోవా, తెలంగాణ నిలిచాయన్నారు. మొత్తం 54,06,070 గృహాలకు ట్యాప్ కనెక్షన్ ద్వారా నీటి సరఫరా జరుగుతోందన్నారు. భారతదేశ గ్రామీణ గృహాలకు నీటి కనెక్షన్లు ఉండేలా చూడడానికి తాము దగ్గరగా ఉన్నామన్నారు. హర్ ఘర్ జల్ అనే తమ ఆలోచన త్వరలోనే నిజమవుతుందని కేంద్ర మంత్రి అన్నారు.

రామాలయం పేరుతో బిచ్చమెత్తున్న బిజెపి

కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు వివాదస్పద వ్యాఖ్యలు
ఎమ్మెల్యే వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేతలు

జగిత్యాల,జనవరి21(ఆర్ఎన్ఎ): అయోధ్య రామ మందిర్ నిర్మాణంపై కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో నిర్మించే రామాలయానికి చందాలివ్వొద్దని చెప్పారు. బీజేపీ నేతలు అయోధ్య రామాలయం పేరుతో బిచ్చమెత్తుకుంటున్నారన్నారు. జగిత్యాలలో జరిగిన రెండో విడత గొర్రెల పంపిణీ సభలో ఈ విధంగా మాట్లాడారు. మన గ్రామాల్లో రాముడు లేడా? ఉత్తరప్రదేశ్‌లో రామాలయానికి చందాలెందుకు ఇవ్వాలని కామెంట్ చేశారు. బొట్టుపెట్టుకుంటేనే రామభక్తులా.. తాము కూడా శ్రీరాముని భక్తులమే ఎమ్మెల్యే విద్యాసాగర్ అన్నారు. అయోధ్యలో చేపట్టనున్న రామమందిర నిర్మాణానికి ఎవ్వరూ విరాళాలు ఇవ్వవద్దంటూ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. మన గ్రామాల్లో రామాలయాలు ఉండగా అయోధ్య రామాలయం మనకెందుకు అంటూ ఆయన ప్రజలనుద్దేశంచి ప్రసంగించారు. రామమందిరం పేరుతో బీజేపీ నాయకులు బిచ్చమెత్తుకుంటున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. తామంతా శ్రీరాముడి భక్తులమేనని, బొట్టు పెట్టుకుంటేనే భక్తులమవుతామా అని బీజేపీ నేతలను ప్రశ్నించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఇలాంటి వివాదస్పద వ్యాఖ్యలు చేయటం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కాగా, గత కొంత కాలంగా రాష్ట్రంలో టీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల విడుదలైన జీహెచ్ఎంసీ ఎన్నికల ఫలితాలు ఇందుకు మరింత ఆజ్యం పోశాయి. బీజేపీ నేతలు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను టార్గెట్ చేస్తుంటే, టీఆర్ఎస్ నేతలు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు చేసిన కామెంట్లపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మెల్సీ రామచంద్రరావు సీరియస్ అయ్యారు. రామమందిరానికి చందాలివ్వొద్దని ఎమ్మెల్యే చెప్పడం సిగ్గుచేటన్నారు. వెంటనే ప్రజలకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలన్నారు. రామాలయం నిర్మాణ నిధి చందా కోసం బీజేపీ ఎవరిపైనా ఒత్తిడి చేయడం లేదన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం ప్రతి హిందువు కల అని..రామ మందిరాన్ని కట్టేందుకు అనేక మంది ముందుకు వచ్చారన్నారు. ప్రతి హిందువును భాగస్వామ్యం చేయాలనే నిధి సేకరిస్తున్నామన్నారు. బొట్టు పెడితేనే హిందువా ? బీజేపీ వాళ్ళు కలెక్షన్లు చేస్తున్నారు.. ఒక్క రూపాయి ఇవ్వవద్దు అని టీఆర్ఎస్ ఎమ్మెల్యే చెప్పడం సిగ్గు చేటు అన్నారు. ఎమ్మెల్యే విద్యాసాగర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కన్నడ హీరోయిన్ రాగిణి ద్వివేదికి ఊరట

బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,జనవరి21(ఆర్ఎన్ఎ): శాండల్‌వుడ్ డ్రగ్స్ కేసులో అరెస్టైన కన్నడ హీరోయిన్ రాగిణి ద్వివేదికి ఊరట లభించింది. ఈమెకు తాజాగా సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఎంతో మందికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారనే ఆరోపణలతో హీరోయిన్లు సంజనా గల్రానీ, రాగిణి ద్వివేదిలను సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) పోలీసులు గతేడాది అరెస్ట్ చేశారు. ఆ కేసులో రాగిణి బెయిల్ పిటీషన్ కోసం దరఖాస్తు చేసుకోగా కర్ణాటక హై కోర్టు నిరాకరించింది. దీంతో ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆ పిటీషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు తాజాగా రాగిణికి బెయిల్ మంజూరు చేసింది. గతేడాది బాలీవుడ్ లో కలకలం సృష్టించిన డ్రగ్స్ కేసు.. అన్ని ఇండస్ట్రీల్లోనూ తాకిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కన్నడ సినీ పరిశ్రమలో డ్రగ్స్ వ్యవహారం సంచలనం రేకెత్తించింది. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారిగా పరిగణించి.. శాండిల్ వుడ్ బ్యూటీ రాగిణి ద్వివేదిని పోలీసులు అరెస్టు చేశారు. ఇండస్ట్రీలో అందరికీ డ్రగ్స్ సరఫరా చేస్తోందని అంతర్జాతీయ డ్రగ్ రాకెట్ తో సంబంధాలు ఉన్నాయనే అభియోగాలతో గత సెప్టెంబరులో జైలుపాలైంది. బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైల్లో ఉన్న ఆమె.. అప్పటి నుంచి బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తూ వచ్చారు. డ్రగ్స్ కేసులో అరెస్టు అయిన రాగిణి.. తనకు బెయిల్ మంజూరు చెయ్యాలని బెంగళూరులోని ప్రత్యేక కోర్టును పలుమార్లు కోరింది.

తిప్పాపూర్ గ్రామస్తులకు టి ఆర్ కే ట్రస్ట్ సహాయం ఎల్లప్పుడూ ఉంటుంది

తోట రామ్ కుమార్‌కు ఘన స్వాగతం పలికిన ఆలయ కమిటీ చైర్మన్ నాయిని శేఖర్ ,గ్రామస్తులు

రాజన్న సిరిసిల్లా, జనవరి 21 (నేటినిజం ప్రతినిధి)::తిప్పాపూర్ గ్రామస్తులు ఎలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్న తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని టి ఆర్ కె?? ట్రస్టు చైర్మన్ తోట రామ్ కుమార్ అన్నారు

వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో వెలసిన శ్రీ షిరిడి సాయి నాథుని ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయంలో టి ఆర్ కె ట్రస్ట్ చైర్మన్ తోట రామ్ కుమార్ తో పాటు ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు .ఈ సందర్భంగా తిప్పాపూర్ కు విచ్చేసిన రామ్ కుమార్ కు గ్రామస్తులు డప్పు చప్పుళ్ళు,నృత్యాలు, టపాసులతో ఘన స్వాగతం పలికారు.



ఊటేగింపు సందర్భంగా రామ్ కుమార్ ప్రతీ ఒక్కరినీ పలకరిస్తూ ఊరేగింపుగా తరలివెళ్లిన రామ్ కుమార్ సాయి బాబా ఆలయం ఆలయ చైర్మన్ నాయిని శేఖర్ తో కలిసి పూజలు నిర్వహించి అర్చకులచే ఆశీర్వాదాన్ని ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తొలుతగా టి ఆర్ కే ట్రస్టు చైర్మన్ తోట రామ్ కుమార్ ఆలయ కమిటీ తోపాటు,మహిళా సంఘాలు గ్రామస్తులు పూల మాలలు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేకమందికి సహాయ సహకారాలు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ అభినందించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టి ఆర్ కే ట్రస్టు చైర్మన్ తోట రామ్ కుమార్ మాట్లాడుతూ అతిపురాతన తొలి సాయి బాబా ఆలయం ఇదే కావడం తిప్పా పూర్ గ్రామానికి తలమానికంగా మారిందని పేర్కొంటూ సాయినాథుని కృపా కటాక్షాలతో గ్రామం దినదిన అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా టి ఆర్ కే ట్రస్టు ద్వారా తిప్పాపూర్ వాసులకు ఎలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్నా తాను ముందుండి నడిపిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సాయిబాబా ఆలయ పరిసరాలను రామ్ కుమార్ తో పాటు గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. తనవంతుగా ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారాలు అందిస్తారని హామీ ఇచ్చారు .పరిశీలన అనంతరం భక్తులకు గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయంగా వడ్డించారు. గ్రామాన్ని సందర్శించడం తనకు ఎంతగానో సంతృప్తినిచ్చిందని పేర్కొంటూ గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాయిబాబా వైస్ చైర్మన్ కూరగాయల ఆగయ్య గౌరవ అధ్యక్షులు జోగిని శంకర్ భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి నేను ఉన్న అంటూ అండగా నిలుస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న యువకునికికుటుంబానికి తన వంతు సాయంగా 50 వేలు అందించిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్లా, జనవరి 21 (నేటినిజం ప్రతినిధి):ఆపదలో ఉన్న వారికి నేనున్నానని అండగామరోసారి యాభై వేల సహాయం చేసి తన దానగుణాన్ని చాటుకున్న దాన హృదయుడుమరోసారి నిరూపించుకున్నజిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే వివరాలకు వెళితే రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారం గ్రామంలోని మ్యకల లక్ష్మీ రామయ్య అనే నిరుపేద దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాహుల్ (27) తమది నిరుపేద కుటుంబం కావడంతో అతికష్టం మీద డిగ్రీ వరకు చదువుకున్నాడు. 2012 లో ట్రాక్టర్ బోల్తా పడి చిన్న ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కాలు ఫ్రాక్చర్ అయింది. తరువాత మూడు సంవత్సరాల వరకు బాగానే ఉన్నాడు. క్రమంగా తన ఎముకలు బలహీనపడ్డాయి. రాహుల్ ఆస్పత్రికి వెళ్లగా ఎముకలలో పాస్పరస్ నిలువలు తగ్గయని వైద్యులు చెప్పారు. హైదరాబాద్లోని ప్రధాన ఆసుపత్రులన్నీ తిరిగారు. ఎదిగొచ్చిన కొడుకు కళ్లముందే జీవచ్ఛవంలా పడి ఉంటే ఆ తల్లి గుండెతెరుక్కుపోతుంది. తమకు సేవ చేయవలసిన సమయంలో తమ కొడుకు సేవ చేస్తుంటే ఆ తల్లి హృదయంగ్భ్రాంతికి లోనవుతుంది. భవిష్యత్తులో ఎంతో ఎత్తుకు ఎదగాలని కోరుకున్నా తల్లి గుండె, మంచానికే పరిమితమైన తన కొడుకుని చూస్తూ రోజు కన్నీరుమున్నీరవుతుంది.ఈ విషయం తెలుసుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆ యువకున్నీ ఆదుకోవడానికి తన వంతు సహాయంగా యాభై వేల రూపాయలు అందించడాం జరిగింది.పోలీస్ యంత్రంగం అన్నివేళలా అండగా ఉంటాదాని ఆ కుటుంబానికి దేర్యం చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో వేములవాడ డిఎస్పీ చంద్రకాంత్ ,సి.ఐ మోగిలి ,ఎస్.ఐ వేకటేశ్వర్లు, సునీల్ పాల్గొన్నారు..

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా అన్ని చర్యలు:జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్లా, జనవరి 21 (నేటినిజం ప్రతినిధి):జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు.

32వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఈ రోజు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ అవగాహనా ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ ర్యాలీ జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే జెండా ఊపి ప్రారంభించారు..ఈ ర్యాలీ ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ప్రారంభమైంది.ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూప్రజలకు ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తామని, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ప్రజలకి పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది వెళ్లి రోడ్డు ప్రమాదాలు, మోటార్ వాహనాల చట్టాల గురించి అవగాహన కల్పించడం కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలు జరగకుండా వాహనదారులు సహకరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే ఆ కుటుంబాలు ఆసరా కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పలు సందర్భాలలో మానవ తప్పిదాలు, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు ప్రతి వాహనానికి నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలని, నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు నివారణపై, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నట్లు వివరించారు. అదే విధంగా ప్రమాదాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రాంతాలలో బొల్ రాడ్స్, స్టాపర్లు, పెయింటింగ్, ప్లాస్టిక్ కోన్స్, సీసీ కెమెరాల లాంటి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారి వల్ల జరుగుతున్నట్లుగా గుర్తించి జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, స్పీడ్ లేజర్ గన్ ద్వారా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలోని ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి ఆయన సూచించారుఈ కార్యక్రమంలో సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ ,ఆర్.టి.ఓ కొండల్ రావు,సి.ఐ వెంకటనర్సయ్య ,ఆర్.ఐ రజినీకాంత్ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..



ఇన్ఆర్బిట్ నిర్వహించనున్న ఈ సంవత్సరపు మొదటి మారథాన్

హైదరాబాద్, జనవరి 21, 2021 – 2021 జనవరి 24 న 'ఇనోర్బిట్ దుర్గం చెరువు 10 కె' మారథాన్ పరుగును నిర్వహించడానికి ఇనార్బిట్ సిద్ధంగా ఉంది. యూట్యూకాన్రన్ సహకారంతో ఇనోర్బిట్ హైదరాబాద్ ప్రజలను 10 కిలోమీటర్ల టైమ్డ్ రన్ లేదా 5 కిలోమీటర్ల ఫన్ రన్ కోసం 999 రూపాయల వద్ద నమోదు చేసుకోవాలని ఆహ్వానించింది.

రూ. వరుసగా 599 (ప్లస్ టాక్స్). రిజిస్టర్డ్ పాల్గొనేవారికి ప్యూమా టీ షర్ట్ ఫినిషర్స్ మెడల్, ప్యాక్ బ్రేక్ ఫాస్ట్ మరియు డిజిటల్ ఫినిషర్స్ సర్టిఫికేట్లతో కూడిన గూడీ బ్యాగ్ లభిస్తుంది. మారథాన్ విజేతలకు విభాగాలలో 2 లక్షల వరకు నగదు బహుమతి ఇవ్వబడుతుంది. పాల్గొనేవారికి 12 సంవత్సరాల మధ్య గెలిచిన 30 కె విలువైన ధరలు కూడా ఉన్నాయి – 5 కె పరుగులో 16 సంవత్సరాలు.

ఈ కార్యక్రమానికి ప్యూమా శక్తినిస్తుంది మరియు ఒక మారథాన్ కోసం స్వచ్ఛంద భాగస్వామిగా నిర్మాన్ కూడా ఉంటుంది. నిర్మాన్ ఒక ఎన్జీఓ, ఇది బాలిక పిల్లల విద్య మరియు హైటెక్ నగర అటవీ నిర్మూలన వైపు దృష్టి పెట్టింది.

ఈ మారథాన్ హైదరాబాద్ గర్వంగా భావించే దుర్గమ్ చెరువు వంతెనపై జరుగుతున్న మొదటి పరుగు. అన్ని కోవిడ్–19 భద్రతా క్రీడా చర్యలతో ఈ రన్ ప్రణాళిక చేయబడింది. ఈ సంఘటన ద్వారా సేకరించిన గణనీయమైన నిధులు దుర్గాం చెరువు వంతెన యొక్క సంరక్షణ వైపు వెళ్తాయి.

రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో దాని ప్రాముఖ్యతను గ్రహించి చాలా మంది ప్రజలు గతంలో కంటే ఇప్పుడు ఫిట్‌నెస్ పాలనలోకి తీసుకున్నారు.

వారు ఆరోగ్యంగా ఉండటానికి అదనపు మైలు దూరం వెళుతున్నారు, "అని ప్యూమా ఇండియా రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశాల్ గుప్తా అన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com